శనివారం
22-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 299
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

టోక్యో నగరంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంతో

జపాన్ నాయకత్వం భేటీ

ఏప్రిల్ 17వ తేదీన జపాన్ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు షీ కజోవ్, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంతో సమావేశమయ్యారు. టోక్యోలో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి వర్గ నాయకుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు ట్రాన్ త్వాన్ ఆన్ పాల్గొన్నారు.

2లో

వ్యక్తిగత లబ్ధి కాదు...
సంస్థలు నిర్మించండి

- భోజనం చేయడానికి న్యాయవాదులు ఇబ్బంది పడుతున్నారు
- కనీస మౌలిక వసతులు కల్పించండి
- ఆర్-5 జోన్‌పై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజధానిలోని ఆర్-5 జోన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. ఆర్-5 జోన్‌లో ఇతర ప్రాంత పేదలకు పట్టాలు ఇవ్వడానికి జగన్ ప్రభుత్వం ప్రయత్నించగా దీనిపై రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. చివరికి తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. ఆర్-5 జోన్‌లో 45 వేల మంది ఇతర ప్రాంత పేదలకు పట్టాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిన విషయం తెల్సిందే. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ఈ ఉత్తర్వులు వ్యతిరేకంగా ఉన్నాయంటూ అమరావతి రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీవోను హైకోర్టులో సవాల్ చేస్తూ రాజధాని రైతులు పిటిషన్ వేశారు. రైతుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. మధ్యంతర ఉత్తర్వుల కోసం రెండు పక్షాలు వాదనలు వినిపించాయి. ఆర్-5 జోన్ ఏర్పాటుపై హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. పేదలకు ఇళ్ల స్థలాలు

- మిగతా 2 లో

ఆదాయార్జన శాఖల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం 2 లో

జగనన్న అడ్డుపుల్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మాజీ ఎంపీ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో రోజుకో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంటోంది. కేసు దర్యాప్తును మృతుడు వివేకా కుమార్తె సునీతారెడ్డి సీరియస్‌గా తీసుకుంది. ఈ కేసులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మరో చిన్నాన్న భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు ఎంపీ అవినాశ్ రెడ్డితో పాటు వారి ముఖ్యఅనుచరులంతా నిందితులుగా ఉండడంతో సీబీఐ అధికారులకు సైతం ఈ కేసు ఒక సవాలుగా మారింది. వివేకాను హత్య చేసి ఇప్పటికే నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో సుప్రీంకోర్టు ఈ నెల 30వ తేదీలోగా ఎట్టిపరిస్థితుల్లో కేసు విషయం తేల్చాలని, ఛార్జిషీట్ సిద్ధం చేయాలని ఆదేశించిన నేపథ్యంలో సీబీఐ విచారణను వేగవంతం చేసింది. అయితే ఈ కేసులో కీలక నిందితులుగా ముఖ్యమంత్రి బంధువులే ఉండడం, వారు దర్యాప్తునకు అడుగడుగునా ఆటంకాలు కల్పించే పరిస్థితి నెలకొని ఉండటంతో సునీత కూడా మరింత దూకుడుగా వ్యవహరిస్తూ వారి ప్రయత్నాలకు ఎక్కడికక్కడ చెక్ పెట్టే ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా అవినాశ్ రెడ్డిని హైకోర్టు ఈనెల 25 వరకు అరెస్ట్ చేయెద్దంటూ ఇచ్చిన ఆదేశాలపై సునీత సుప్రీంను ఆశ్రయించింది. ఎటువంటి ఆంక్షలూ లేకుండా సీబీఐని స్వేచ్ఛగా దర్యాప్తు చేయనివ్వాలంటూ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్, అందులో పేర్కొన్న అంశాలు ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి. ఈసారి ఆమె తొలిసారి నేరుగా సీఎం జగన్‌పై ఎటాక్ చేశారు. వివేకా హత్య కేసు దర్యాప్తు ఒక కొలిక్కి రాకముందే నవంబర్ 19వ తేదీ 2021న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏపీ అసెంబ్లీలో అవినాశ్ రెడ్డికి క్లీన్ చిట్ ఇస్తూ మాట్లాడారు. ముఖ్యమంత్రే స్వయంగా ఒక నిందితునికి క్లీన్ చిట్ ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అలాగే ప్రస్తుతం ఈ కేసులో అవినాశ్ రెడ్డి పేరు కీలకమని సీబీఐ అధికారులు గుర్తించి విచారణ ప్రారంభించిన తర్వాతే జగన్ క్రియాశీలకంగా వ్యవహరించడం ప్రారంభించారు. వివేకా హత్యకు సంబంధించిన ఛార్జిషీటులో అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, డి.శివశంకర్ రెడ్డి పేర్లు రావడంతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ప్రభావవంతమైన నేతలు దర్యాప్తును ముందుకు సాగనీయకుండా అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా వైఎస్ అవినాశ్ రెడ్డిని రక్షించేందుకు పూర్తి స్థాయిలో రంగంలోకి దిగారని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది లూథ్రా వాదనలు వినిపించారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత కోర్టులో విచారణ సమయంలో చేపట్టాల్సిన అంశాలను బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవడం సరికాదు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కేసులోని మెరిట్స్ ప్రకారం లేవు. హత్య కేసు దర్యాప్తుపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా హైకోర్టు వ్యవహరించింది. హత్య వెనుక ఉన్న విస్తృత కుట్ర కోణాన్ని బయటపెట్టాలని, ఈనెల 30 లోగా దర్యాప్తు పూర్తి చేయాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ పరిస్థితుల్లో దర్యాప్తు సంస్థ సీబీఐపై ఎలాంటి నియంత్రణ లేకుండా స్వేచ్ఛగా పని చేసేలా చూడాలి. కానీ తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు దర్యాప్తునకు అవరోధం కలిగించేలా ఉన్నాయని న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు. వాదనలు విన్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్ అంశంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తప్పుబట్టింది.

ఆ ఉత్తర్వులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడుతూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చింది. ఈనెల 24న దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని, అప్పుడు అన్ని విషయాలను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. అప్పటివరకు అవినాశ్‌ను అరెస్ట్ చేయవద్దని సీబీఐని ఆదేశించింది. ఈనెల 30లోపు కేసు విచారణ పూర్తి చేయాలంటూ గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను పొడిగిస్తామని తెలిపింది.

మూడో రోజూ 6 గంటలపాటు అవినాశ్ రెడ్డి విచారణ

వివేకా హత్య కేసులో కడప వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అవినాశ్ రెడ్డిని హైదరాబాద్ సీబీఐ కార్యాలయంలో మూడవరోజు శుక్రవారం కూడా సుమారు 6 గంటల పాటు విచారించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న అవినాశ్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి, ఆయన ముఖ్య అనుచరుడు ఉదయ్ కుమార్ రెడ్డిని కూడా సుమారు 6 గంటల పాటు సీబీఐ అధికారులు విచారించారు. అనంతరం భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్‌ను సీబీఐ కార్యాలయం నుంచి చంచల్‌గూడ జైలుకు తరలించారు. భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్‌ను శనివారం మరోసారి సీబీఐ కస్టడీలోకి తీసుకోనుంది. ఈ నెల 24 వరకు సీబీఐ కస్టడీకి సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే.

వివేకా హత్యకేసులో ఆటంకాలన్నీ జగన్ సృష్టించినవే
సునీత న్యాయవాదుల ఆరోపణ

- అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై తీర్పును తప్పుబట్టిన సుప్రీం
- స్టే ఇస్తూ 24న తుది విచారణ చేపడతామని వెల్లడి
- అప్పటివరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశం

సత్యపాల్ మాలిక్‌కు
సీబీఐ సమన్లు

న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ అవినీతికి పాల్పడిందన్న ఆరోపణలపై సాక్షిగా విచారించేందుకు జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శుక్రవారం సమన్లు జారీ చేసింది. మాలిక్ 2018లో జమ్ముకశ్మీర్ గవర్నర్‌గా ఉన్నప్పుడు కంపెనీ ఒప్పందాన్ని రద్దు చేశారు. కశ్మీర్ ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య బీమా పథకాన్ని రూపొందించడంలో అవినీతి కుంభకోణం జరిగిందన్న ఆరోపణలపై రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్‌తో పాటు ట్రినిటీ రీఇన్సూరెన్స్ బ్రోకర్లను నిందితులుగా సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. బీమా పథకంలో అవకతవకలు జరిగాయని మాలిక్ ఆరోపించగా, ఆ తర్వాత సీబీఐ

- మిగతా 2 లో

మత్తు పదార్థాల సరఫరా కేంద్రాలుగా
అదానీ పోర్టులు

- జానెడు ఇచ్చి... బారెడు లాక్కొంటున్న జగన్
- బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను సాగనంపే వరకు పోరాటం
- తిరుపతి ప్రచారభేరి బహిరంగ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: గంజాయి, మత్తు పదార్థాల సరఫరాకు కేంద్రాలుగా అదానీ పోర్టులు మారిపోయాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ధ్వజమెత్తారు. సంపద మొత్తం కోటీశ్వరుల చేతికి వెళ్లిపోతోందన్నారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి నగరంలో ప్రచార భేరిలో భాగంగా సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో జరిగిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర 410 రూపాయలు ఉండగా బీజేపీ ఆందోళన చేసిందని... నేడు మోదీ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.1,200 రూపాయలకు చేరిందని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. నల్లధనం బయట తీస్తానంటూ, పెద్ద నోట్లు రద్దు చేసి నల్ల ధనం మొత్తం తమకు కావాల్సిన వారి ఇళ్లకు చేర్చారని విమర్శించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన హక్కులను ప్రశ్నించడంలో

- మిగతా 2 లో

డార్విన్ సిద్ధాంతం తొలగింపు
విద్యార్థుల భవిష్యత్తుపై
గొడ్డలిపెట్టు



న్యూఢిల్లీ: పదో తరగతి సిలబస్ నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించాలన్న కేంద్రం నిర్ణయం విద్యార్థుల భవిష్యత్తుపై గొడ్డలిపెట్టు వంటిదని దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవశాస్త్ర అధ్యయనానికి ఇది "ప్రమాదకరమైన పరిణామము" అని పేర్కొన్నారు. పదవ తరగతి సిలబస్ నుండి జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలగించాలని నిర్ణయించినట్లు కేంద్ర ఉన్నత పాఠశాల పాఠ్య ప్రణాళిక బోర్డు ప్రకటించిన సంగతి తెలిసిందే. హేతుబద్ధమైన ప్రపంచ దృష్టి కోణాన్ని అధ్యయనం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందని, జీవశాస్త్ర అధ్యయనానికి ఇది

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ధరిత్రీ దినోత్సవం సందర్భంగా మీకో విన్నపం మా భూములు లాక్కోకండి సారు!

నేడు నింగిలోకి
పీఎస్ఎల్వీ-సీ55

విశాలాంధ్ర-సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 22వ తేదీ శనివారం మరో వాణిజ్య ప్రయోగానికి సిద్ధమయింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి శనివారం మధ్యాహ్నం 2 గంటల 20 నిమిషాలకు పీఎస్ఎల్వీ-సి55 రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన టెల్ ఇయోస్-2 ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. 741 కిలోల బరువు కలిగిన సింగపూర్ ఉపగ్రహంతో పాటు 16 కిలోల లుమొలైట్ అనే ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించడానికి సర్వం సిద్ధం చేసింది. ప్రయోగం కౌంట్ డౌన్ శుక్రవారం 12.50 నిమిషాలకు ప్రారంభమై 25.30 గంటల కౌంట్ డౌన్ ముగిసిన అనంతరం రాకెట్‌ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు నిర్ణయించారు. గత నెల 26న జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్‌ను

- మిగతా 2 లో

యర్రగొండపాలెం ఉద్రిక్తం

- చంద్రబాబు రోడ్‌షోకు వైసీపీ అడ్డంకులు
- వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తల తోపులాట
- మంత్రి కార్యాలయంపై రాళ్లు విసిరిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్రానికి ఇదేమికర్మ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు శుక్రవారం యర్రగొండపాలెంలో పర్యటిస్తున్నారు. గతంలో దళితుల పట్ల అనుచితంగా వ్యవహరించిన చంద్రబాబు క్షమాపణ చెప్పి యర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రవేశించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖమంత్రి ఆదిమూలపు సురేశ్ వైసీపీ కార్యకర్తలతో కలిసి నిరసన ప్రదర్శనకు దిగారు. నల్లవస్త్రాలు ధరించి...నల్ల బెలూన్లు ఎగురవేసి చంద్రబాబు గో బ్యాక్ అంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి ఆదిమూలపు సురేశ్ నాయకత్వంలోఆందోళనకు దిగారు. చంద్రబాబు రోడ్‌షోను అడ్డుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ శ్రేణులు కూడా పెద్ద ఎత్తున రోడ్లమీదకు తరలివచ్చారు. రెండువర్గాలను అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున రంగంలోకి దిగారు. ఈ క్రమంలో ఒకరికొకరు విమర్శలు

- మిగతా 2 లో

టోక్యో నగరంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంతో

జపాన్ నాయకత్వం భేటీ

ఏప్రిల్ 17వ తేదీన జపాన్ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు షీ కజోవ్, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంతో సమావేశమయ్యారు. టోక్యోలో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి వర్గ నాయకుడు, పోలిట్‌బ్యూరో సభ్యులు ట్రాన్ త్వాన్ అన్ పాల్గొన్నారు. ఆయన వియత్నాం ఆర్థిక విభాగానికి అధ్యక్షుడు కూడా.

అంతర్జాతీయ స్థాయిలో తూర్పు ఆసియాలో శాంతి సుస్థిరతకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చేస్తున్న కృషిని, అనుభవాలను మార్పిడి చేసుకున్నారు. ఆ ప్రాంతంలో అణ్వాస్త్రాలను నిర్మూలించాలి. ఇండో..పసిఫిక్ ప్రాంతంలో పరిణామాలను వాటి ప్రాధాన్యతను చర్చించారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు మధ్య సంబంధాలను మరింత పటిష్టవంతం చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ఉన్నతస్థాయి సమావేశాలను నిర్వహించాలని భావించారు. మార్క్సిజం సిద్ధాంత సమస్యలపై ఉభయులు తమ వైఖరులను వెలుబుచ్చారు. ముఖ్యంగా అంతర్జాతీయ సమస్యలపై తరచూ చర్చలు జరగవలసిన

అవసరాలను గుర్తించారు.

ఉభయ పార్టీల సమావేశంలో జపాన్ కమ్యూనిస్టుపార్టీ ఉపాధ్యక్షులు తమౌరా తముకో, ఒగోట యస్‌వో కూడా సంభాషణలో పాల్గొన్నారు.

జపాన్‌లో దేశవ్యాపిత స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు

ఏప్రిల్ 9న జపాన్‌లో దేశవ్యాపితంగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగినాయి. ఎన్నికల్లో జపాన్ కమ్యూనిస్టు పార్టీ పోటీ చేసింది. మొదటి రౌండ్ ఫలితాలు వెలువడినాయి. 41 స్థానిక సంస్థల అసెంబ్లీ ఎన్నికల్లో జపాన్ కమ్యూనిస్టు పార్టీ మొత్తం 77 స్థానాలు గెలుచుకుంది. కొన్నింటిని కొత్తగా గెలుచుకున్నది..కొన్నింటిని కోల్పోయింది. గెలిచిన అభ్యర్థుల్లో మహిళలు 57.3 శాతం ఉన్నారు. ఓట్ల శాతం పెరిగింది. 17 మేజర్ నగరపాలక సంస్థల అసెంబ్లీ ఎన్నికల్లో జపాన్ కమ్యూనిస్టు పార్టీ 93 స్థానాల్లో విజయం పొందింది. గత ఎన్నికల్లో పోలిస్తే కొన్ని స్థానాలను కోల్పోయింది. ఏప్రిల్ 11న జపాన్ కమ్యూనిస్టు పార్టీ ఎగ్జిక్యూటివ్ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో ఎన్నికల్లో పార్టీని గెలిపించినందుకు కార్యకర్తలకు, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపింది. కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా స్థానిక అభివృద్ధి సమస్యలను, నివాసితులకు కల్పించవలసిన సౌకర్యాల గురించిన సమస్యలపై కేంద్రీకరించింది. ఉదాహరణకు బాలబాలికలకు ఉచిత వైద్య సౌకర్యాలు, మధ్యాహ్నం భోజనం పథకం, ప్రీమియం లేకుండానే ఇన్సూరెన్స్ పాలసీలను అమలుపరిచేందుకు పెద్ద ఉద్యమాలనే నడిపింది. ఈ పోరాటంలో పలు విజయాలను సాధించింది.

ప్రభుత్వ విధానాలపై నిరంతర ఆందోళనా కార్యక్రమాలను చేపట్టింది. తూర్పు ఆసియాలో శాంతి ఆవశ్యకతను చాటిచెప్పింది.

కేంద్రంలో ఉన్న కిషిదా ప్రభుత్వం చేపట్టిన సైనిక పథకాలను వ్యతిరేకించింది. మున్నెన్నడూ లేని రీతిలో దానికి ప్రభుత్వం నిధులను కేటాయించింది. రెండో రౌండు దేశ వ్యాపిత ఎన్నికలు ఏప్రిల్ 23వ తేదీన జరుగుతాయి.

బ్రిటన్ ఉప ప్రధాని రాజీనామా

లండన్: బ్రిటన్ ఉప ప్రధాని, న్యాయశాఖ మంత్రి డొమినిక్ రాబ్ తన పదవికి రాజీనామా చేశారు. వేధింపులతో కూడిన ఆయన ప్రవర్తన గురించి వచ్చిన ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో పదవికి రాజీనామా సమర్పించారు.

అంతకముందు బ్రిటన్ విదేశాంగ శాఖ మంత్రిగా పనిచేసిన రాబ్‌ను గతేడాది అక్టోబర్‌లో భారత సంతతికి చెందిన రిషి సునాక్ నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉప ప్రధానిగా రాబ్‌ను తన బృందంలోకి తీసుకున్న విషయం విదితమే.

విద్యార్థుల భవిష్యత్తుపై గొడ్డలిపెట్టు

(మొదటిపేజీ తరువాయి)

కీలకమని వాదిస్తున్నారు. దీంతో ప్రతి విద్యార్థి జీవ పరిణామ సిద్ధాంతం గురించి తెలుసుకోవాలవారు వారు వాదిస్తున్నారు. సైన్స్‌లో ఈ ప్రాథమిక ఆవిష్కరణపై అధ్యయనం లేకుంటే విద్యార్థులు మానసిక వైకల్యానికి గురవుతారని హెచ్చరించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనపై 1800 మందికి పైగా శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, ఇతరులు సంతకం చేశారు. కోలకత్తాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుండి భౌతిక శాస్త్రవేత్త సౌమిత్రో బెనర్జీ, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుండి జీవశాస్త్రవేత్త రాఘవేంద్ర గడగ్కర్, నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ డైరెక్టర్ బెంగళూరుకి చెందిన జీవశాస్త్రవేత్త ఎల్.ఎస్. శశిధర్ తదితరులు సంతకం చేసిన వారిలో ఉన్నారు. పరిణామ క్రమంతో సమాజాలు, దేశాలకు ఎదురయ్యే సవాళ్లను మనం ఎలా ఎదుర్కొంటామనే అంశంపై విజ్ఞాన శాస్త్రం ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మానవుల గురించి అవగాహనను విస్తృతం చేయడంతో పాటు జీవన చిత్రంలో మన స్థానాన్ని తెలుపుతుందని అన్నారు. ఇటీవల 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పన్నెండవ తరగతి పాఠ్యాంశాలలో చరిత్రలో మొఘలులు, మహాత్మాగాంధీకి సంబంధించిన అంశాలను జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) తొలగించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. పాఠ్యాంశాల తొలగింపు జాబితాలో పదవ తరగతి నుండి చార్లెస్ డార్విన్, జీవ పరిణామ మూలం, పరిణామం, పరిణామ సంబంధాలు, శిలాజాలు, మానవపరిణామ క్రమం చాప్టర్‌లు ఉండటం గమనార్హం. ఇవన్నీ మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో కీలకమైన భాగాలని పేర్కొన్నారు.

సత్యపాల్ మాలిక్‌కు సీబీఐ సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

చర్య తీసుకుంది. దీనిపై మరింత సమాచారం రాబట్టాలని సీబీఐ భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దాదాపు 3.5 లక్షల మంది ఉద్యోగులను కవర్ చేసే ఈ బీమా పథకం...సెప్టెంబర్ 2018లో రూపొందించారు. అయితే మాలిక్ దీనిని ఒక నెలలోనే రద్దు చేశారు. అవినీతి జరిగినట్లు గుర్తించినందున రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతున్నారని, వివరాలను పరిశీలించిన తర్వాత తాను కూడా అదే నిర్ణయానికి వచ్చానని మాలిక్ ఆ సమయంలో చెప్పారు. 'నేను స్వయంగా ఫైళ్లను పరిశీలించాను... కాంట్రాక్ట్ తప్పుగా ఇచ్చినట్లు నేను నిర్ధారణకు వచ్చాకనే దానిని రద్దు చేశాను' అని మాలిక్ వెల్లడించారు.

నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ55

(మొదటిపేజీ తరువాయి)

విజయవంతంగా ప్రయోగించారు. శ్రీహరికోటలోని నూతనంగా నిర్మించిన అనుసంధాన భవనం నుంచి ఈ రాకెట్‌ను అమర్చారు. మొత్తం నాలుగు దశలతో పాటు రాకెట్ శీర్ష భాగాన హీట్ షీల్డ్‌లో ఈ సింగపూర్‌కి చెందిన ఉపగ్రహాన్ని అమర్చారు. ఈ రాకెట్ ద్వారా విదేశీ ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగిస్తూ ఉండడం వలన ఇది పూర్తిగా వాణిజ్య ప్రయోగం. శాస్త్రవేత్తలు ఎమ్మార్వో సమావేశాన్ని నిర్వహించి అందులో రాకెట్ ప్రయోగ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఒక రాకెట్ ప్రయోగాన్ని విజయవంతం చేసి నెల రోజులు పూర్తికాకముందే మరో రాకెట్ ప్రయోగానికి ఇస్రో సిద్ధం చేసి ప్రయోగించడం ద్వారా మరో రికార్డును సొంతం చేసుకోబోతుంది. ప్రయోగం నేపథ్యంలో భద్రతా సిబ్బంది కట్టుదిట్టమైన ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. సముద్ర మార్గం గుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏడాదికి 12 ప్రయోగాలు లక్ష్యం : ఇస్రో చైర్మన్ సోమనాథ్

సూళ్లూరుపేటలో ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్ పూజలు నిర్వహించారు. శనివారం షార్ సెంటర్ నుంచి జరిగే పీఎస్ఎల్వీ-సి 55 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి, చైర్మన్ బాలచంద్ర రెడ్డి స్వాగతం పలికారు. ఇస్రో చైర్మన్ ఆలయంలోని పరివార దేవతలను దర్శించిన అనంతరం చెంగాళమ్మను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ పీఎస్ఎల్వీ-సి 55 రాకెట్ ప్రయోగం శనివారం మధ్యాహ్నం 2 గంటల 20 నిమిషాలకు ఉంటుందని తెలిపారు. కౌంట్ డౌన్ శుక్రవారం మధ్యాహ్నం 12 :50కి ప్రారంభమైందని 25 గంటల 30 నిమిషాల పాటు కొనసాగుతుందని అన్నారు. ఏడాదికి 12 ప్రయోగాలు చేయడం లక్ష్యంగా ఇస్రో షార్‌లో ప్రత్యేక వసతులు సమకూర్చిందని, ఇప్పుడు జరిగే ప్రయోగం పూర్తి స్థాయి వాణిజ్య ప్రయోగాలలో ఐదవది అని ఆయన వివరించారు. సింగపూర్‌కు చెందిన టెలియోస్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. తరువాత ప్రయోగం జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా నావికా ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని, అలాగే చంద్రయాన్-3, ఆదిత్య ప్రయోగాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, వంకా దినేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటూ రాళ్లు రువ్వుకున్నారు. చంద్రబాబు యర్రగొండపాలెంలోకి ప్రవేశించగానే టీడీపీ శ్రేణులు రోడ్డు పక్కనే ఉన్న మంత్రి కార్యాలయంపై రాళ్లు విసిరారు. పోలీసులు జోక్యం చేసుకొని రెండువర్గాలను నివారించ గలిగారు. ఈ క్రమంలో మంత్రి ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ దళితులను అవమానించే విధంగా చంద్రబాబు గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. అందువల్ల దళిత నియోజకవర్గంలో పర్యటించే అర్హత చంద్రబాబుకు లేదని అన్నారు. చంద్రబాబుతో పాటు లోకేశ్ కూడా దళితుల పట్ల అనుచితంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రోడ్‌షోలో భాగంగా మంత్రి ఆదిమూలపు సురేశ్ కార్యాలయం వద్దకు వచ్చిన చంద్రబాబు... ఖబడ్దార్ అంటూ మంత్రిని హెచ్చరించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు పశ్చిమ ప్రాంతం లో పర్యటన విజయవంతమైందని, ఓర్వలేక ఇలాంటి చిల్లర రాజకీయాలకు వైసీపీ బరి తెగించిందని చంద్రబాబు మండిపడ్డారు. టీడీపీ హయాంలోనే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందిందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకు లు, కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరోపక్క యర్రగొండపాలెంలో జోరు వర్షం కురుస్తున్నా చంద్రబాబు రోడ్ షో కొనసాగించారు.

ఆదాయార్జన శాఖల్లో

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం

అధికారులకు సీఎం జగన్ ఆదేశం

మెరుగైన విధానాలుండాలని సూచన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రానికి ఆదాయాన్నందించే శాఖల్లో మానవ ప్రమేయాన్ని తగ్గించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సేవలందించే విధానాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆయా శాఖాధికారులను ఆదేశించారు. మెరుగైన విధానాలు ఉండాలని, తద్వారా సమర్థత పెరుగుతుందని, పన్నులు చెల్లించేవారికి సౌలభ్యంగా సేవలు అందుతాయన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆదాయాన్ని ఆర్జించే శాఖలపై సీఎం శుక్రవారం సమీక్ష చేశారు. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎంతమేర లక్ష్యాలను చేరుకున్నామో, ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సీఎంకు వివిధ శాఖల అధికారులు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే వాణిజ్య పన్నుల ఆదాయ వృద్ధిలో ఏపీ మెరుగైన పనితీరు కనబరిచిందని, కర్ణాటక, మహారాష్ట్రల కంటే మెరుగైన స్థానంలో ఏపీ ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే కర్ణాటకలో 27.51శాతం, మహారాష్ట్రలో 24.4 శాతం, ఆంధ్రప్రదేశ్ లో 25.29శాతం వృద్ధి నమోదు కాగా, 2022-23లో రాష్ట్రంలో వాణిజ్యపన్నుల ఆదాయం రూ. 51,481 కోట్లతో 93.24శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్టుగా అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (2023-24) రూ.60,191 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. లీకేజీలను అరికట్టి, సమగ్ర పర్యవేక్షణలద్వారా లక్ష్యాన్ని చేరుకునే మార్గాలపై దృష్టిపెట్టినట్లు అధికారులు వెల్లడించారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల ఆదాయం 2018-19లో రూ.4725 కోట్లు కాగా, 2022-23 నాటికి రూ. 8071కోట్లకు చేరిందన్నారు. రిజిస్ట్రేషన్లు, టౌన్ ప్లానింగ్ విభాగాలు, మండల కార్యాలయాలు, గ్రామవార్డు సచివాలయాలు సహా ఇతర చోట్లకూడా ఎక్కడా కూడా అవినీతికి ఆస్కారం ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సేవలు అందించడంలో అత్యంత పారదర్శకత ఉండాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. గతంతో పోలిస్తే లిక్కరు, బీరు వినియోగం తగ్గిందని ఎక్సైజ్ శాఖాధికారులు తెలిపారు. గనులు, ఖనిజాల శాఖలో 2022-23 లో రూ.4500 కోట్లు లక్ష్యం కాగా, రూ. 4,756 కోట్ల

ఆదాయం ఉందని, గత ఏడాదితో పోలిస్తే 26శాతం వృద్ధి చెందిందని, ఈ ఏడాది రూ.6వేలకోట్ల మేర ఆదాయ లక్ష్యాన్ని పెట్టుకున్నామని తెలిపారు. రవాణాశాఖలో 2022-23లో ఆదాయం రూ. 4294.12 కోట్లు కాగా 95.42శాతం లక్ష్యాన్ని రవాణా శాఖ చేరుకుందని, 2018-19లో ఈ ఆదాయం రూ. 3224.98 కోట్లు కాగా ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) లో రూ.6999.42 కోట్ల ఆర్జన లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు వివరించారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం (ఎక్సైజ్) నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావు, ప్రత్యేక సీఎస్‌లు నీరబ్‌కుమార్ ప్రసాద్, రజత్ భార్గవ, భూగర్భ గనుల శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ముఖ్యకార్యదర్శి శ్యామలరావు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఉచిత పంటల బీమా పథకానికి జాతీయస్థాయిలో గుర్తింపుపై సీఎం అభినందన

ఇటీవల రాయ్‌పూర్‌లో జరిగిన పీఎంఎఫ్‌బీవై జాతీయ సదస్సులో ఇన్నోవేషన్ కేటగిరీలో ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్‌కు కేంద్ర వ్యవసాయ కార్యదర్శి మనోజ్ అహుజా అందచేశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసి, కేంద్రప్రభుత్వం అందజేసిన జ్ఞాపికను వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆ శాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్ చూపించగా, వారిని సీఎం అభినందించారు.

రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం

ఇ-స్టాంపింగ్ సేవలను ప్రారంభించిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రిజిస్ట్రేషన్ శాఖలో ఇ-స్టాంపింగ్ సేవలను శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ విధానం సురక్షితమైనది, భద్రతగలది అని తెలిపారు. నగదు, చెక్కు, ఆన్ లైన్ (నెఫ్ట్, ఆర్టీజీఎస్, పీఓఎస్, యూపీఐ) ద్వారా సులభంగా చెల్లింపులు చేయవచ్చు. ఎస్‌బీఐ, ఆప్కాబ్, యూనియన్ బ్యాంకులకు చెందిన ఎంపిక చేసిన శాఖలు, సీఎస్సీ కేంద్రాలు, స్టాంప్ అమ్మకందార్లు, స్టాక్ హోల్డింగ్ శాఖలు కలిపి మొత్తం 1400కు పైగా కేంద్రాల వద్ద ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. సుమారు 1000కి పైగా కేంద్రాల వద్ద త్వరలో ఈసేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఇప్పుడు ఏపీలో క్రయవిక్రయాలు నిర్వహించే పౌరులందరూ 1400కు పైగా ఎంపిక చేసిన కేంద్రాల వద్ద ఇ-స్టాంపింగ్ ద్వారా స్టాంప్ పేపర్లు కొనుగోలు చేసి సులభంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలను చెల్లించవచ్చు. స్టాంప్, రిజిస్ట్రేషన్ శాఖ సెంట్రల్ రికార్డు నిర్వహించే ఏజెన్సీ అయిన స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఏపీ ప్రభుత్వం అందిస్తున్న మరొక ప్రజాహితమైన కార్యక్రమం అని తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎంలు నారాయణ స్వామి, కొట్టు సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావు, ఐటీ సలహాదారు శేషిరెడ్డి, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ కమిషనర్, ఐజీ రామకృష్ణ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ డీఐజీ (గుంటూరు) జి.శ్రీనివాసరావు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు హాజరయ్యారు.

ముస్లిం సోదరులకు కేసీఆర్ శుభాకాంక్షలు

మత సామరస్యానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటన

హైదరాబాద్: ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి కేసీఆర్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షల ద్వారా పరిఢవిల్లిన క్రమశిక్షణ, సహోదరత్వం, దైవభక్తి, ఆధ్యాత్మికచింతన స్ఫూర్తితో 'ఈద్ ఉల్ ఫితర్' పర్వదిన వేడుకలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరితో కలిసి సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. అల్లా దీవెనలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా భగవంతుని ఆశీర్వాదాలు అందాలని కేసీఆర్ ప్రార్థించారు. గంగా జమునా సంస్కృతికి తెలంగాణ నేల ఆలవాలమని, లౌకికవాదాన్ని, మత సామరస్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటిలాగే కట్టుబడి ఉందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. విద్య, ఉపాధితో పాటు పలు రంగాల్లో ఆసరానందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు భరోసాగా నిలిచిందన్నారు. వారి జీవితాల్లో గుణాత్మక మార్పుకోసం అమలు చేస్తున్న పలు పథకాలు ఫలితాలనిస్తున్నాయని తెలిపారు. స్వయం పాలనలో గడచిన తొమ్మిదేళ్ల కాలంలో మైనారిటీ సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 13 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేస్తున్నదని కేసీఆర్ వివరించారు. మైనారిటీల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పలు పథకాలు, ప్రగతి కార్యాచరణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, వారి అభివృద్ధి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వ నిరంతర కృషి కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు.

భారతీయుల రక్షణకు చర్యలు

ఉన్నతస్థాయి సమీక్షలో మోదీ

న్యూఢిల్లీ: సూడాన్‌లో సైన్యానికి, పారామిలిటరీ దళమైన ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య జరుగుతోన్న సాయుధ పోరాటంలో వందలమంది పౌరులు, సైనికులు మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. చర్చలకు ప్రయత్నాలు జరుపుతున్నప్పటికీ అవి కొలిక్కి రావడం లేదు. దీంతో అక్కడున్న సుమారు 4 వేల మంది భారత పౌరులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే భారత ప్రభుత్వం అక్కడున్న వారిని అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సూడాన్‌లోని పరిస్థితులు, భారతీయుల తరలింపు అంశాలపై సమీక్షించారు. సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను ఇక్కడికి తీసుకొచ్చేందుకు లేదా వారికి రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను మోదీ ఆదేశించారు. వర్చువల్‌గా జరిగిన ఈ సమావేశంలో విదేశాంగమంత్రి జైశంకర్, వైమానిక, నావికాదళ అధినేతలతోపాటు విదేశాంగ, రక్షణశాఖ ఉన్నతాధికారులు, సీనియర్ దౌత్యవేత్తలు పాల్గొన్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఐరాస ప్రధాన కార్యదర్శితో జైశంకర్ భేటీ

'సూడాన్‌లో పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయి. భారతీయుల రక్షణ, వారి భద్రతపై దృష్టి సారించాం. అక్కడి నుంచి తరలించే సాధ్యాసాధ్యాలపై ఆలోచిస్తున్నాం' అని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ తరుణంలో ఐరాస సెక్రటరి జనరల్ ఆంటోనియా గుటెరస్‌తో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ న్యూయార్క్‌లో భేటీ అయ్యారు. సాధ్యమైనంత తొందరగా ముందస్తు కాల్పుల విరమణ కోసం దౌత్యాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సూడాన్‌లోని భారతీయులు అక్కడి భారత రాయబార కార్యాలయానికి వెళ్లొద్దని కేంద్రం ఇప్పటికే సూచనలు జారీ చేసింది. మరోవైపు సూడాన్‌లో కొనసాగుతోన్న ఘర్షణల్లో ఇప్పటికే ఓ భారతీయుడు సహా 300 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో తమ పౌరులను స్వదేశాలకు తరలించేందుకు వివిధ దేశాలు ముందుకు వస్తున్నా... విమానాశ్రయాలే రణక్షేత్రాలుగా మారడంతో అది సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది. ఇలా అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో మోదీ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష జరిపారు.

అదానీ పోర్టులు

(మొదటిపేజీ తరువాయి)

జగన్ ఘోరంగా విఫలమయ్యారని, రాష్ట్రం నుంచి కేంద్రానికి చెల్లించిన జీఎస్టీ డబ్బులు రాబట్టుకోవడానికి కూడా సాహసం చేయడం లేదని చెప్పారు. ప్రజలకు జానెడు ఇచ్చి... బారెడు లాక్కోవడం జగన్ విధానమని నారాయణ అన్నారు. మద్యం, ఇసుక, చివరకు సినిమా టికెట్ల నుంచి కూడా ప్రజల నుంచి దండుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు. రాష్ట్రంలో దళితులపై వైసీపీ ప్రభుత్వం దాడులు చేస్తోందన్నారు. చివరకు ముఖ్యమంత్రి చిన్నాన్న కూడా దారుణ హత్యకు గురయ్యారని, ఎవరు హత్య చేశారో ప్రతి ఒక్కరికీ తెలుసు అని, ఇలాంటి కేసుల నుంచి బయటపడేందుకు కేంద్ర ప్రభుత్వానికి దాసోహం జగన్ అయిపోయాడని విమర్శించారు. వేలిముద్ర గాళ్లకు ఓట్లు వేయించుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వైసీపీ, బీజేపీ ప్రభుత్వాలను సాగనంపేందుకు విపక్షాలతో పాటు ప్రజలూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. దేశాన్ని రక్షించుకోవాలంటే బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకం

కావాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ మోదీ దుర్మార్గ పాలన నుంచి విపక్షాలతో పాటు ప్రజలందరూ చైతన్యంతో రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, ఆర్ఎస్ఎస్ మనువాద రాజ్యాంగాన్ని తీసుకొస్తున్నారని విమర్శించారు. 80 శాతం పేద, బడుగు, బలహీన వర్గాలను 20 శాతం ధనికులు శాసిస్తున్నారని అన్నారు. బందిపోట్లు లాంటి దేశీయ, విదేశీ కార్పొరేట్ శక్తులతో మోదీ జత కట్టి దేశ సంపద దోచుకుంటున్నారని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ వైసీపీ నేతలు కోట్లు మింగి, ప్రజలకు బటన్ నొక్కి చిల్లర విదిలిస్తున్నారని అన్నారు. రూ.14 లక్షల కోట్లు బ్యాంకుల నుంచి రుణాలు ఇస్తే ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయారని, దీనికి ప్రధాన కారణం మోదీ అని అన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా పెంచారని, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోదీని సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, కుమార్ రెడ్డి, నదియా, కత్తి రవి, ఉదయ్, చలపతి, నగర కార్యదర్శి విశ్వనాథ్, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు మురళి, జయచంద్ర, సాయి లక్ష్మి, నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, డప్పు కళాకారుల సంఘం నేత శ్రీనివాస్, జిల్లా నాయకులు నాగరాజు, సూరి అధ్వర్యంలో ఆలపించిన ఉద్యమ గేయాలు ఆకట్టుకున్నాయి.

సంస్థలు నిర్మించండి

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చేందుకే ఆర్-5 జోన్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ తరపు న్యాయవాది వాదనలు వినిపించగా... ముందు ఇక్కడ పనిచేసే న్యాయవాదులకు లాంజ్‌లు లేదు. లంచ్ చేసేందుకు అవకాశం లేదు. కనీసం మౌలిక వసతులు కూడా కల్పించలేదని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. వ్యక్తులకు లాభం కలిగించడం కాదు...సంస్థలను నిర్మించండి అంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇప్పటికే హైకోర్టుకు సరైన రోడ్డు లేదు... సాయంత్రం లైట్లు కూడా వెలగడం లేదని రైతుల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు ఆదేశించినా చర్యలు చేపట్టలేదని గుర్తుచేశారు. దీనిపై కోర్టు ధిక్కార పిటిషన్ వేసినట్లు న్యాయవాదులు జ్ఞాపకం చేశారు. సీఆర్‌డీఏ కమిషనర్‌ను కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చినట్లు న్యాయవాది గుర్తుచేశారు. పిటిషనర్లతో పాటు ప్రభుత్వం తరపు వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

ఆర్-5జోన్ ఏర్పాటుపై గత ఏడాది అక్టోబరులో ప్రభుత్వం జీవో విడుదల చేసింది. స్థానికంగా పేదల కోసం నిర్మించిన ఇళ్లను ఇవ్వకుండా ఇతర ప్రాంతాల వారికి పేదల పేరుతో రాజధాని నిర్మాణం కోసం ఇచ్చిన భూములు ఇవ్వడం సరికాదని, రాజధాని రైతులు ప్రభుత్వ జీవోను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఆ మేరకు గ్రామసభలు నిర్వహించగా, ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు మూకుమ్మడిగా వ్యతిరేకించారు. అయినప్పటికీ రైతుల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం ఆర్-5జోన్ ఏర్పాటుపై గెజిట్ విడుదల చేసింది. దీంతో రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

జంగిల్ క్లియరెన్స్‌ను అడ్డుకున్న రైతులు

ఆర్-5జోన్ వ్యవహారంపై ఓ పక్క హైకోర్టులో విచారణ జరుగుతుండగా, మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ కోసం పొక్లెయిన్లను పంపి రైతులతో కవ్వింపు చర్యలకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కృష్ణాయపాలెం రైతులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని ఆ పనులను అడ్డుకున్నారు. పొక్లెయిన్లను వెనక్కు పంపారు. వివేకానందరెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం ఈ కుట్రలకు పాల్పడుతుందంటూ రైతులు మండిపడ్డారు. రాజధాని ప్రాంత పేదల కోసం గత ప్రభుత్వం దాదాపు 5వేల ఇళ్లకు పైగా నిర్మించింది. వాటిని నాలుగేళ్లుగా లబ్ధిదారులకు అప్పగించకుండా పాడుపెట్టిన ఈ ప్రభుత్వం...ఇతర ప్రాంతాల్లోని పేదలకు ఈ భూములు ఇస్తుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు, ఈ ప్రాంత వ్యవసాయ కూలీలకు కౌలు, పెన్షన్లు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ, పేదల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నమే ఆర్-5 జోన్ అని విమర్శించారు. పేదల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతుల ప్లాట్లను అభివృద్ధి చేసి అప్పగించాలని హితవు చెప్పారు.

మోదీ బాబా 30 దొంగలు

- డంపింగ్ యార్డ్‌గా విశాఖ స్టీల్ ప్లాంట్
- దేశ సంపద కోటీశ్వరుల చేతికి
- రాహుల్‌పై కక్ష పూరిత వైఖరి
- కేసుల భయంతోనే జగన్ ఢిల్లీ యాత్ర
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి : దేశంలోని సంపదను కొల్లగొట్టి 30 మందికి నరేంద్ర మోదీ పంచి పెడుతున్నారని, నాడు అలీబాబా 40 మంది దొంగలనే నానుడు ఉండేదని, నేడు మోదీ బాబా 30 దొంగలుగా మారిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ధ్వజమెత్తారు. 30 మందిలో 29 మంది ఇప్పటికే విదేశాలకు వెళ్లిపోయారని, ఒక్క అదాని మాత్రమే మిగలగా, అతనికి కూడా ప్రభుత్వ ఆస్తులు కట్టబెడుతున్నాడని విమర్శించారు. ఈ 30 మందీ మోదీ దత్తపుత్రులే అన్నారు. శుక్రవారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం కక్షపూరిత చర్య అని, నెహ్రూ కుటుంబం దేశానికి ఎంతో సేవ చేసిందన్నారు. యూపీ మాజీ ఎంపీ అతీఖ్‌ను పోలీసుల వలయంలో ఉండగానే హత్య చేశారన్నారు. బజరంగ్ దళ్ కార్యకర్తలు హత్య చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని తెలిపారు. గాడ్సే నోటి నుంచి ఊడి పడిన వ్యక్తి నరేంద్ర మోదీ అని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అదానీకి అప్పగిస్తే డంపింగ్ యార్డ్‌గా మార్చివేస్తాడని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బీఆర్ఎస్ టేకోవర్ చేస్తామని చెప్పినా సీఎం జగన్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కేవలం తన చుట్టూ ఉన్న కేసులను మాఫీ చేసుకోవడానికి జగన్ ఢిల్లీ యాత్ర చేస్తున్నాడే తప్ప రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం, విభజన హక్కుల సాధన కోసం వెల్లడం లేదని నారాయణ స్పష్టం చేశారు. సీబీఐ కేంద్రంలో చేతిలో కీలుబొమ్మలా మారిపోయిందన్నారు. రాష్ట్రం మొత్తం అవినీతిమయంగా మారిపోయిందని, దేశంలో ఇంతకంటే దిగజారుడు ముఖ్యమంత్రి మరొకరు లేరని అన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటు అన్నారు. చంద్రబాబు ప్రారంభించిన పథకాలను ఆపివేయడం శోచనీయమని తెలిపారు. ఆర్థిక నేరగాళ్లకు అధికార ప్రతినిధిగా సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర మంత్రులు రెండు రోజుల్లో రెండు రకాల ప్రకటనలు చేయడం దారుణం అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మే 3న రాష్ట్రవ్యాప్తంగా అఖిలపక్షం అధ్వర్యంలో రాస్తారోకోలు నిర్వహిస్తున్నామన్నారు. స్టీల్ ప్లాంట్‌పై తీర్మానానికి పరిమితం కాకుండా వైసీపీ ప్రత్యక్ష ఆందోళనకు రావాలని పిలుపునిచ్చారు. పోరాటంలో పాల్గొనకుంటే జగన్ జీవచ్ఛవంలా మిగిలిపోతారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ జిల్లాలో జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్‌గా మారి మామిడికి ధర లేకుండా చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మామిడికి గిట్టుబాటు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని, జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కుమార్ రెడ్డి, నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు డిమాండ్

విశాలాంధ్ర-వినుకొండ: వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదని వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కృష్ణా గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం వినుకొండకు వచ్చిన ఆయన యూటీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి డీఎస్సీ లేక నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ అంశంపై ఇటీవల శాసనమండలిలో చర్చిస్తే విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ 717 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ప్రకటించడాన్ని తాము తీవ్రంగా ఖండించామ న్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20వేల ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 1998 డీఎస్సీ సుదీర్ఘ పోరాటమని దీనిపై ప్రభుత్వం ఎట్టకేలకు ఉద్యోగాలు ఇస్తామని అంగీకరించిందన్నారు. కానీ 6800 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసిన ప్రభుత్వం కేవలం 4052 పోస్టులు మాత్రమే ఇస్తామనడం, దానిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసిన వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వం కుంటి సాకులు పక్కనపెట్టి వెంటనే ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దుచేసి "బదిలీల కోడ్"అమలు చేసి వేసవిలో బదిలీల ప్రక్రియ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విషయంలో ఉపాధ్యాయులపై ప్రభుత్వం ఒత్తిడి తేవడం సరికాదన్నారు. రోజుకు 30 పేపర్లు దిద్దాల్సిన వారు 60 పేపర్లు దిద్దడం అంటే కష్టతరమేనని అన్నారు. మూల్యాంకన కేంద్రాల్లో ఉపాధ్యాయులకు మౌలిక సదుపాయాలు లేవని వెంటనే అవసరమైన సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు, ఆర్.అజయ్ కుమార్, జి.రామారావు, సీహెచ్ తిరుపతిరెడ్డి, హనుమంత సూరి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలు తగ్గించాలి

- హంద్రీ-నీవా ద్వారా చెరువులకు నీళ్లు నింపాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లెనిన్ బాబు

విశాలాంధ్ర-కృష్ణగిరి : కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థల ఆదాయమే లక్ష్యంగా పని చేస్తోందని, నిత్యావసర సరుకులు, గ్యాస్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.లెనిన్ బాబు, మండల కార్యదర్శి ఖలీల్, సహాయ కార్యదర్శి జె.రవిమోహన్ విమర్శించారు. శుక్రవారం కృష్ణగిరి మండలంలోని కటారుకొండ గ్రామంలో సీపీఐ అధ్వర్యంలో సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ప్రచార భేరి కార్యక్రమం సందర్భంగా కరపత్రాలు పంచుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీ సేవలో నిమగ్నమై ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి, మత రాజకీయాల ద్వారా పరిపాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం కోసం నిధులు విడుదల చేయకుండా, ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా జిల్లాలోని అన్ని చెరువులకు నీళ్లు నింపి తాగు, సాగునీటి సౌకర్యం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా సంక్షేమ పథకాల పేరుతో అప్పులు తీసుకువచ్చి అప్పుల ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. ధరల నియంత్రణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద కూలీ రేట్లు రోజుకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కటారుకొండ గ్రామ కార్యదర్శి గొల్ల వెంకట్, రాముడు, సహాయ కార్యదర్శి ఆర్.బి చిన్నమాదులు, పులిచెర్ల చెన్నయ్య, కటారుకొండ గ్రామ నాయకులు నక్కి నడిపి రాముడు, ఉప సర్పంచ్ బోయ ముని, పెద్ద అయ్యన్న భాష్యం రాముడు, హరిజన గోపాలు పాల్గొన్నారు.

లోకేశ్ యువగళానికి ఆటంకం

ఆదోనీలో వైసీపీ, టీడీపీ పరస్పర నినాదాలు

విశాలాంధ్ర-ఆదోని: కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో రెండవ రోజు జరిగిన యువగళం పాదయాత్రలో స్థానిక కోట్ల సర్కిల్‌లో వైసీపీ-టీడీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. స్థానిక బైపాస్ రోడ్డు నుండి శుక్రవారం ప్రారంభమైన పాదయాత్ర పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, తిక్కస్వామి దర్గా, కంట్రోల్ రూమ్, కోట్ల సర్కిల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఇస్వీ గ్రామం వరకు కొనసాగింది. 'లోకేశ్ గో బ్యాక్...గో బ్యాక్' అంటూ కోట్ల సర్కిల్ వద్ద వైసీపీ నాయకులు నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా 'సీఎం డౌన్ డౌన్' అంటూ టీడీపీ నాయకులు నినాదాలు చేయడంతో తోపులాట జరిగింది. అంతకుముందు లోకేశ్ మాట్లాడుతూ బెంజ్ మంత్రి ఈఎస్ఐ స్కామ్ ద్వారా బెంజ్ కారు బహుమతిగా తీసుకున్నారని ఆరోపించారు. పైగా అమాయకంగా చర్చకు సిద్ధమా అంటూ మంత్రి సవాల్ చేయడం హాస్యాస్పదమని లోకేశ్ అన్నారు. రైతుల నుండి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములు వెనక్కివ్వడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. ఆదోని వద్ద జాతీయ రహదారి 167 వల్ల 400 కుటుంబాలకు నష్టం జరుగుతోందని, వైసీపీ నేతలు వారి స్వార్థం కోసం భూముల ధరలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆదోని బైపాస్ బాధితులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వం దళితులకు తీరనిద్రోహం చేసిందని, ఎస్సీల సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన రూ.28 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిందని ఆరోపించారు. ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మిస్తే సీమ ఎడారవుతుందని, జగన్‌కు రాయలసీమ ఓట్లపై ఉన్న ప్రేమ అభివృద్ధిపై లేదని విమర్శించారు. వేదావతి ప్రాజెక్టు పరిధిని జగన్ ప్రభుత్వం నాలుగు టీఎంసీలకు తగ్గించిందని, టీడీపీ అధికారంలోకి రాగానే 8 టీఎంసీలకు పెంచుతామని హామీ ఇచ్చారు. పశ్చిమ రాయలసీమలో విద్యాసంస్థలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసలు నివారిస్తామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషకు నిధులు కేటాయించి, పేద ఆర్యవైశ్యులకు సబ్సిడీ రుణాలిస్తామన్నారు. ఇంటిపన్ను, కరెంటు చార్జీలతో సీఎం జగన్ ప్రజల్ని జలగల్లా పీల్చుకు తింటున్నారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే సైకో పోవాలి... సైకిల్ రావాలని పిలుపునిచ్చారు.

విధుల్లో నిర్లక్ష్యం... ఏడుగురిపై వేటు

డీఈఓ, ఇద్దరు ఎంఈఓల సస్పెన్షన్

విశాలాంధ్ర-పార్వతీపురం/ సీతమ్మపేట: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకుగాను మన్యం జిల్లాలో ఏడుగురు ఉద్యోగులను రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ సస్పెండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గురువారం సాయంత్రం నుండి శుక్రవారం సాయంత్రం వరకు సుడిగాలి పర్యటన చేసిన ప్రవీణ్ ప్రకాశ్...మన్యం జిల్లా డీఈఓ డాక్టరు ఎస్‌డీవీ రమణను, వీరఘట్టం, సీతమ్మపేట మండలాల విద్యాశాఖ అధికారులను, కేజీబీవీ ప్రిన్సిపాల్, మరో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్ ప్రకాశ్ మన్యం జిల్లాలోని వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీని, పాలకొండ మండలం కొండాపురం పాఠశాలను, సీతమ్మపేటలోని ఉన్నత పాఠశాలను, సీతమ్మపేట మండలంలోని మర్రిపాడు ప్రాథమిక పాఠశాలను, భామిని మండలంలోని ఉన్నతపాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో లోటుపాట్లను గుర్తించి... దీనికి బాధ్యులైన జిల్లా విద్యాశాఖాధికారితోపాటు వీరఘట్టం ఎంఈఓ పి.కృష్ణమూర్తి, జిల్లా అధికారి రోజారమణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రోహిణి, సీతమ్మపేట ఎంఈఓ ఆనందరావు, మర్రిపాడు ఎంపీపీ పాఠశాల హెచ్ఎం రామినాయుడు, భామిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన గణితశాస్త్ర ఉపాధ్యాయుడు రాంబాబులను సస్పెండ్ చేశారు. వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులకి నవంబరులో ఇవ్వాల్సిన రెండవ సెమిస్టర్ లెక్కల పుస్తకాలని నేటికీ పంపిణీ చేయకపోవడం, మర్రిపాడు పాఠశాలలో సగం మంది విద్యార్థులు బెంచీలమీద, సగం మంది నేలమీద కూర్చోవడం, పిల్లలు ఏకరూప దుస్తులు ధరించక పోవడం, విద్యాబోధన సక్రమంగా లేకపోవడం, వర్క్‌బుక్స్ విద్యార్థులతో రాయించకపోవడం, పాఠశాలలో తాగునీటి ప్లాంట్ పనిచేయకపోవడం, గడువుతేదీ ముగిసినా చిక్కీలు పాఠశాలలో ఉండడం, భామిని జడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయుడు సిలబస్ పూర్తి చేయకపోవడం, విద్యార్థుల చేత వర్క్ బుక్ రాయించక పోవడం వంటి కారణాల వల్ల ఏడుగురిని సస్పెండ్ చేశారు. పుస్తకాల పంపిణీపై నెలరోజుల్లో విచారణ జరిపి సమగ్ర నివేదిక అందజేయాలని సీతమ్మపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారిని ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారిగా విశాఖపట్టణం రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన వెంట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఇతర అధికారులు ఉన్నారు. ప్రవీణ్ ప్రకాశ్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని డీఈఓ, ఇద్దరు ఎంఈఓలు, నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో ఉపాధ్యాయ సంఘాలనేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

రాఘవులు ఆశయ సాధనకు కృషి చేద్దాం

వర్ధంతి సభలో రావుల వెంకయ్య

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: నిరంతరం పేదల కోసం పనిచేసిన వలేటి రాఘవులు ఆశించిన లక్ష్యం కోసం పనిచేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య అన్నారు. రాఘవులు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేశ్‌బాబు అధ్యక్షతన శుక్రవారం సభ జరిగింది. వెంకయ్య మాట్లాడుతూ రాఘవులు కందుకూరు నియోజకవర్గంలో అనేక సమస్యలపై రాజీలేని పోరాటాలు నడిపి ఎంతోమంది పేదలకు ఇంటి స్థలాలు ఇప్పించడంలో ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన జీవితాంతం కమ్యూనిస్టుగానే జీవించారని, ఎర్రజెండా లక్ష్యం నెరవేరాలని పరితపించారని అన్నారు. కందుకూరు పట్టణంలో అనేక కాలనీలలో కమ్యూనిస్టు పార్టీ శాఖల ఏర్పాటు కోసం ఆయన ఎంతో శ్రమించారన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మాల కొండయ్య, కొండపి నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం పనిచేయాలని సీపీఐ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పి.బాలకోటయ్య, నాయకులు డి.ఆదినారాయణ, కె.మురళీకృష్ణ, వై.ఆనందమోహన్, బాలబ్రహ్మాచారి, దండోరా దాస్, రాఘవులు కుటుంబ సభ్యులు స్టాలిన్ బాబు, ప్రమీల రాణి, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆందోళనకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీ జేఏసీ అమరావతి పిలుపుమేరకు ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి జరుగుతున్న న్యాయబద్ధ పోరాటానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ప్రకటించారు. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పి.దామోదర్ రావుల నాయకత్వాన శుక్రవారం జేఏసీ ప్రతినిధి వర్గం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి తాము చేస్తున్న ఉద్యమానికి సహకరించాలని కోరగా, ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతునిస్తుందని రావుల వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మికుల యెడల అవలంబిస్తున్న విధానాలు ఆక్షేపణీయంగా ఉన్నాయని, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకోసం ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ అధ్వర్యంలో ఇప్పటికే అనేక రంగాలకు చెందిన కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశామని, పోలీసులు అరెస్టులు, నిర్బంధాలు కూడా ఎదుర్కొని పోరాడి విజయాలు సాధించుకున్నామని రవీంద్రనాథ్ వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం విభజించు, పాలించు విధానాలు అవలంబిస్తోందని, ఆ ఉచ్చులో సంఘాలు చిక్కుకోవద్దని కోరారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులు యెడల అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఉమ్మడి కార్యచరణ రూపకల్పన చేసేందుకు ఈనెల 28న రెవెన్యూ భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని దానిలో ఐక్య కార్యచరణ రూపొందిస్తామని, 25న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసనల్లో కార్మిక సంఘాలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ సెక్రెటరీ జనరల్ పి.దామోదర్ రావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పూదోట ప్రకాష్, ఎం.సాంబశివరావు, నీలం దుర్గారావు. ఏ.ఆంజనేయులు, తెద్దు వెంకటేశ్వర్లు, జేఏసీ అమరావతి నాయకులు శ్రీనివాసరావు, అప్పారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

సహజమరణం దిశగా విశాఖ ఉక్కు

పోరాటకమిటీ నాయకుడు ఆదినారాయణ విమర్శ

విశాలాంధ్ర-కూర్మన్న పాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో 799వ రోజు రిలేదీక్షలో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికుల పాల్గొన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ దీక్షలో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం విశాఖ ఉక్కును పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమిస్తున్న దన్న కోపంతో ప్లాంట్‌లో ఉత్పత్తి లేకుండా చేయడం, దీనిని సహజ మరణం దిశగా నెట్టాలని చూస్తోందని విమర్శించారు. ఈఓఐ పేరుతో దొడ్డిదారిన ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆదినారాయణతో పాటు పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు జె.రామకృష్ణ, చిత్రాడ సన్యాసిరావు మాట్లాడారు. 2021-22లో విశాఖ ఉక్కు పరిశ్రమ రూ.950 కోట్ల నికర లాభాలతో 28 వేల కోట్ల పైచిలుకు టర్నోవర్ సాధించిందన్నారు. 2022-23లో మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో ఒకదానిని మూసివేసి ఉత్పత్తి తగ్గించి నష్టాలబాట పట్టించారని విమర్శించారు. కేంద్రప్రభుత్వం, యాజమాన్యం సకాలంలో ఉక్కు ఉత్పత్తుల తయారీకి కావలసిన కోకింగ్ కోల్, బాయిలర్ కోల్ వంటి ముడిసరుకు కొనుగోలు చేయకుండా తాత్సారం చేసి నెలలు తరబడి ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి నిలిపివేయడం వలన నష్టాలు వచ్చేలా చేశారని నిందించారు. ఇటువంటి చర్యలు శోచనీయమని, ప్లాంట్‌ను నష్టాల వైపు నెట్టి ఆపై ప్రైవేటు వారికి కారుచౌకగా కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలో యాజమాన్యం పాలుపంచుకుంటున్నదని ఆరోపించారు. లక్షల మందికి అన్నం పెట్టే ఈ పరిశ్రమను మూసివేసే దిశగా ప్రణాళికలు రచించడం హర్షణీయం కాదన్నారు. ఆర్థిక ఇబ్బందుల సాకుతో స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని చూడటం తగదని, ఉద్యమాలకు కేంద్రం తలవంచక తప్పదని స్పష్టంచేశారు. దీక్షా కార్యక్రమంలో సీహెచ్ సాయిరామ్, సయనబాబు, మంత్రి రవికిరణ్, నల్ల రవి, రొంగలి వెంకట్రావు, విజయ్‌కుమార్, మహేశ్, డి.శ్రీనివాస్, ఎస్వీయస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాలువల ఆధునీకరణ ఎప్పుడు?

ఉపాధి శాఖ పట్టించుకునేనా?

జామి మండలంలో కాలువల పరిస్థితి దయనీయం

విశాలాంధ్ర-జామి(విజయనగరం): 'ఈ ఫొటోలో చూస్తున్నది విజయనగరం జిల్లా జామి మండల కేంద్రం మీదుగా ప్రవహించే జామి-అన్నంరాజుపేట సాగునీటి కాలువ. మొత్తం 2200 ఎకరాలకు సాగునీరు అందించాల్సిన కాలువ. కానీ మురికి కాలువకన్నా హీనంగా మారింది. ఈ చానల్‌లో పూడికతీత పనులు చేసి ఎన్నళ్లు అయిం దో... బహుశా రైతులకు, అధికారులకు కూడా గుర్తులేదు. కంపు కొడుతున్న ఈ కాలువ ఎక్కడో మూలన లేదు. నీటి పారుదల, ఉపాధి హామీ కార్యాలయాలను ఆనుకునే ఉంది. ఇదొక్కటే కాదు... మండలంలో దాదాపు 12 వరకు ఉన్న సాగునీటి కాలువల పరిస్థితి ఇలాగే ఉంది'. జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను మూడు రోజులక్రితం సాగునీటి కాలువలపై సమీక్షించారు. ఈ సమయంలో జిల్లాలోని అన్ని సాగునీటి కాలువలను ఉపాధి హామీ పథకం కింద మరమ్మతులు చేయాలని, పూడికతీసి ఆధునీకరించాలని ఆదేశించారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలన చేస్తే అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతుంది. మండలంలోని ఇరిగేషన్ పరిధిలో ఉండే కాలవలన్నీ తాటిపూడి రిజర్వాయర్‌కు సంబంధించినవే. ఏడాది క్రితమే సాగునీటి కాలువల పూడికతీతకు సంబంధించి ఉపాధి శాఖ అధికారులకు నివేదిక పంపించామని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ నేటి వరకు ఒక్క కాలువ కూడా పూర్తి చేసిన దాఖలాలు లేవు. అన్ని కాలువలు కలిపి దాదాపు 50 నుంచి 60 కిలోమీటర్లు పొడవు కలిగి ఉంటాయని చెబుతున్నారు. ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్ లేక చిన్నపాటి చిట్టడవిని తలపించేలా కాలువలు మారు తున్నాయి. వీటికి మోక్షం ఎప్పుడు కలుగు తుందోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఏడాది క్రితమే జాబితా అందజేశాం: ఇరిగేషన్ ఏఈ కృష్ణమూర్తి

మండలంలోని సాగునీటి కాలువ జాబితాను అంచనా కోసం ఏడాది క్రితమే ఉపాధి అధికారులకు అందజేశాం. మా శాఖ వద్ద నిధులు లేకపోవడంతో ఉపాధిలోనే పనులు చేయాల్సి ఉంది. రూ.10 లక్షలు ఖర్చు దాటిన చెరువులకు మాత్రమే మా అనుమతి అవసరముంది. సాగునీటి కాలువల పనులు చేపట్టకపోవడానికి కారణాలు తెలియదు.

త్వరలోనే పూర్తి చేస్తాం: ఉపాధి ఏపీవో శేఖర్

సాగునీటి కాలువలకు అంచనాలు పూర్తి చేశాం. కొన్ని కాలువల వద్ద పనులు పూర్తి చేశాం. మిగిలిన కాలువలకు సంబంధించిన పనులు త్వరలోనే చేపడతాం. అన్ని కాలువలూ ఒకేసారి జరగాలంటే కష్టం. అందుకే దశల వారీగా పనులు చేస్తున్నాం. మండలంలోని అన్ని సాగునీటి కాలువలలో పనులు చేస్తాం.

జగన్ సర్కార్‌కు మిగిలింది రోజులే

లోకేశ్ పాదయాత్రతో రాష్ట్ర ప్రజల్లో ఉత్సాహం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: జగన్ ప్రభుత్వానికి రోజులు మాత్రమే ఉన్నాయని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర 1,000 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి హర్షాతిరేకాలు తెలిపారు. ఈ సందర్భంగా గంటా విలేకరులతో మాట్లాడుతూ లోకేశ్ నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేయాలనుకోవడం మహోన్నత లక్ష్యమన్నారు. పాదయాత్రను ఆపటానికి ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టించిందని, అయితే ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో వెనక్కి తగ్గిందని అన్నారు. పాదయాత్రతో లోకేశ్ పరిపూర్ణ నాయకుడిగా ప్రజల్లో తిరుగుతున్నారని తెలిపారు. మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి సౌండ్ లేకుండా రౌండ్ వేశారని, జగన్ ఇంటికి వెళ్లిపోవడానికి 350 రోజులే మిగిలి ఉన్నాయని అన్నారు. ఏ ముఖ్యమంత్రి అయిన ఢిల్లీ వెళ్లి వస్తే తప్పనిసరిగా విలేకరుల సమావేశం పెట్టి ఆ వివరాలు వెల్లడించేవారని, కానీ సీఎం జగన్ ఇప్పటివరకు చాలాసార్లు ఢిల్లీ వెళ్లి వచ్చినప్పటికీ, ఇంతవరకు ఎటువంటి మీడియా సమావేశం పెట్టకపోవడం గమనించవలసిన విషయమని తెలిపారు. విశాఖలో దసపల్లా, సీబీసీఎన్‌సీ భూములు, ఎన్‌సీసీ భూములు, హయగ్రీవ భూములు, రామానాయుడు స్టూడియో లేఅవుట్‌లపై సీఎం జగన్, మంత్రి అమర్‌నాథ్ ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముందు విశాఖ ప్రజలకు భరోసా కల్పించాలని, ఆ తర్వాత రాజధాని కోసం మాట్లాడాలన్నారు. సీత కొండకు ఎస్సార్ వ్యూ పాయింట్‌గా పేరు మార్చడం దురదృష్టకరమని, ఈ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పేరు పెట్టాలనుకుంటే జాతీయ స్థాయి ప్రముఖుల పేర్లు పెట్టాలే కానీ, ఈవిధంగా దిగజారి పోకూడదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీతో పొత్తుకు టీడీపీ వెంపర్లాడుతోందని జీవీఎల్ అనడం సరికాదని, అసలు మీ ఓటు శాతం ఎంతో తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. ముందు స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కృషి చెయ్యండి అని హితవు పలికారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సెప్టెంబరులో విశాఖలో కాపురం పెడతా అని జగన్ అనడం విడ్డూరంగా ఉందని, ఎన్ని కాపురాలైనా పెట్టుకో, ఎక్కడైనా పెట్టుకో మాకు అభ్యంతరం లేదని వ్యంగ్యంగా అన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ చిక్కాల విజయబాబు పాల్గొన్నారు.

సంపాదకీయం

మారణకాండ వాస్తవం నిందితులంతా నిర్దోషులే

న్యాయం నత్త నడక అన్యాయం అన్నది నానుడి. గుజరాత్ మారణ కాండలో న్యాయం నత్తకే నడకలు నేర్పించడమే కాక మత మారణహోమంలో బాధితులకు వారి బంధు మిత్రులకు, సన్నిహితులకు కూడా ఆందోళన కలిగించే తీర్పు వెలువడింది. 2002 ఫిబ్రవరి 28న అహమదాబాద్ నగరంలోని నరోదా గ్రామం లో నిర్భీతిగా, నిర్లజ్జగా, పోలీసు బలగాల సహాయ నిరాకరణ నేపథ్యంలో జరిగిన మారణ కాండలో 11 మందిని సజీవ దహనం చేశారు. అంతకు ఒక రోజు ముందు సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు పెట్టి దహనం కేసులో 58 మంది మరణించారు. వీరంతా అయోధ్య నుంచి తిరిగి వస్తున్న వారేనంటారు. ఈ వ్యవహారంపై అనేక దర్యాప్తులు జరిగినా అసలు దోషులు ఎవరో తేలలేదు కానీ కొందరు అమాయకులు శిక్షలకు గురయ్యారు. ఆ మర్నాడు ఈ 58 మంది మృతదేహాలను అప్పటి మోదీ ప్రభుత్వం విశ్వహిందూ పరిషత్తుకు అప్పగించింది. వారి అంత్యక్రియల సందర్భంగానే విశ్వహిందూ పరిషత్ బంద్ కు పిలుపు ఇచ్చింది. 58 మంది మృతదేహాలను నడివీధుల్లో ఊరేగించడానికి అనుమతించడం వెనక మోదీ ప్రభుత్వానికి ఏ దురుద్దేశం లేదు అంటే నమ్మడం దుర్లభం. ప్రజల మనోభావాలు రెచ్చగొట్టడానికే ఇదంతా చేశారని చెప్పక్కర్లేదు. గోద్రా రైలు పెట్టె దహనం సాకుగా గుజరాత్ లో భారీ ఎత్తున మారణ కాండ కొనసాగింది. ఈ దారుణంలో ఎంతమంది బలయ్యారు అన్న విషయంలో ఇప్పటికీ అందుబాటులో ఉన్నవి కాకి లెక్కలే. వెయ్యి మందికి పైగా అని కొందరు అంటే కాదు కనీసం రెండు వేల మంది అని మరికొందరు అంటుంటారు. ఆ సంఖ్య నికరంగా తేలనప్పటికీ మృతుల్లో అత్యధిక సంఖ్యాకులు ముస్లింలేనన్నది నిర్వివాదాంశం. ఆ తరవాత గుజరాత్‌లో ఎన్నడూ మతకలహాలు జరగలేదని ప్రస్తుతం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గొప్పగా చెప్పుకుంటారు.

తాము 2002లో తగిన గుణపాఠం చెప్పినందువల్లే మతకలహాలు జరగడం లేదని అమిత్ షా గర్వంగా ప్రకటించారు. ముస్లింలకు గుణపాఠం చెప్పారని ఆయన ఆంతర్యం. నిజానికి అవి మతకలహాలు కావు. రెండు మతాలవారు సంఘర్షిస్తే దాన్ని మతకలహం అనొచ్చు. కానీ అప్పుడు జరిగింది కేవలం మారణ హోమం. ఈ వ్యవహారంపై అనేక దర్యాప్తులు జరిగాయి. విచారణ కమిషన్లు ఏర్పడ్డాయి. అయినా బాధితులకు, మృతుల కుటుంబాలకు జరిగిన న్యాయం మాత్రం పూజ్యం. తాజాగా నరోదా గ్రామం మారణ కాండలో 11 మంది సజీవ దహనానికి కారకులన్న ఆరోపణ ఎదుర్కుంటున్న 68 మంది నిర్దోషులని ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. ఈ 68 మందిలో మోదీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మాయా కొద్నానీ కూడా ఉన్నారు. 97 మంది మృతికి కారణమైన నరోదా పాటియా కేసులో ఆమెకు మొదట శిక్ష పడింది. ఆ తరవాత ఆమె నిర్దోషిగా తేలడం న్యాయం జరగవలసిన చోట అన్యాయం మాత్రమే జరగడానికి నిదర్శనం. 2002 మారణ కాండలో ప్రధానమైన తొమ్మిది సంఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పడింది. ప్రత్యేక కోర్టులూ ఏర్పడ్డాయి. న్యాయం మాత్రం లేశమాత్రమే. 2012లో అంటే మారణకాండ జరిగిన దశాబ్దానికి మాయా కొద్నానీకి 28 ఏళ్ల శిక్ష పడింది. ఈ కేసులో నిజానికి మరణ శిక్ష విధించాలి కాని మహిళ అయినందువల్ల 28 ఏళ్ల శిక్ష విధిస్తున్నానని అప్పటి న్యాయమూర్తి అన్నారు. కానీ 2018లో గుజరాత్ హైకోర్టు ఆమెను నిర్దోషి అని తేల్చి వదిలేసింది.

గుజరాత్ మారణకాండలోని అన్ని ముఖ్యమైన కేసుల్లోనూ విచారణ తంతు దశాబ్దాలపాటు సాగింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటేనే కానీ 2008 ఆగస్టు 26న ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పడలేదు. మొత్తం మీద విచారణ 2010లో మొదలైంది. తీర్పు రావడానికి దాదాపు 13 ఏళ్లు పట్టింది. బాబూ బజరంగీ పాత్ర గురించి అశీష్ ఖేతన్ అనే పత్రికా రచయిత రహస్యంగా సమాచారం సేకరించినప్పుడు బాబూ బజరంగీ తన పాత్రను అంగీకరించాడు. కానీ తీర్పు చెప్పిన న్యాయమూర్తి దీన్ని నమ్మదగిన సాక్ష్యంగా భావించలేదు. కోర్టులో ఈ కేసును ఇంతవరకు ఆరుగురు న్యాయమూర్తులు విచారించారు. మొదట ఎస్.హెచ్. ఓరా విచారించారు. తరవాత ఆయన గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఆ తరవాత జ్యోత్స్న యాగ్నిక్, కె.కె. భట్, పి.బి.దేశాయ్ విచారించారు. వీరందరూ విచారణ పూర్తి కాక ముందే ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరవాత విచారణ చేపట్టిన ప్రత్యేక న్యాయమూర్తి ఎం.కె.దవేను బదిలీచేశారు. సాక్షులను విచారించడం నాలుగేళ్లు సాగింది. చివరకు న్యాయమూర్తి బక్షీ తీర్పు వెలువరించారు. నరోదా గ్రామ కేసులో నిందితులపై హత్య, హత్యా యత్నం, చట్ట వ్యతిరేకంగా గుమి కూడడం, దొమ్మీకి పాల్పడడం, మారుణాయుధాలతో దాడి చేయడం లాంటి తీవ్రమైన ఆరోపణలే ఉన్నా 11 మంది మరణించడం నిరాకరించలేని వాస్తవమే అయినా ప్రాసిక్యూషన్ ఏ ఆరోపణనూ రుజువు చేయడానికి తగిన సాక్ష్యాధారాలను సమకూర్చలేక పోయింది. ప్రాసిక్యూషన్ వైఫల్యం అంటే అది గుజరాత్‌లో అప్పటి నుంచి ఇప్పటిదాకా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ వైఫల్యమే. ఈ నేరాలు గనక రుజువై అత్యధిక శిక్ష విధించేటట్టయితే అది మరణ శిక్ష అయి ఉండేది. కానీ నిందితులందరూ నిర్దోషులుగా తేలి లేదా తేల్చి విడుదలై పోయారు.

నరోదా గ్రామ కేసులో మొత్తం నిందితులు 86 మంది. విచారణ కొలిక్కి రాకముందే 18 మంది మరణించారు. ఒక వ్యక్తి ఇంతకు ముందే నిర్దోషిగా బయటపడ్డారు. గుజరాత్ మారణకాండ కేసుల్లో చివరి విచారణ నరోదా గ్రామ మారణకాండదే. 11 మంది మృతి చెందిన కేసులో మరణాలు వాస్తవం. హంతకులు ఎవరూ లేరు అని తేలింది. మూక దాడులు జరిగినప్పుడు నిందితులు ఫలానా వారు అని చెప్పడం కుదరకపోవచ్చు. కానీ నిందితుల జాబితాలో పోలీసులు అనేకమందినిచేర్చినా వారిమీద తామేమోపిన ఆరోపణలను రుజువు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. నిందితులను దోషులుగా నిలబెట్టడానికి అవసరమైన సాక్ష్యా ధారాలను ప్రాసిక్యూషన్ సమర్పించి ఉండకపోవచ్చు. కానీ ప్రత్యేక దర్యాప్తు బృందాలు సేకరించిన సాక్ష్యాలు విస్తృతంగానే ఉన్నాయి. వీటినీ కేసును ఒక కొలిక్కి తీసుకొచ్చిన న్యాయమూర్తి శుభద బక్షి నమ్మడానికి నిరాకరించారు. విచారణ క్రమంలో ప్రస్తుతం కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్ షా కూడా 2018లో సాక్ష్యం చెప్పారు. మారణకాండ జరిగిన సమయంలో మాయా కొద్నానీ శాసనసభలో ఉన్నారని అమిత్‌షా చెప్పిన మాటను మాత్రం బక్షీ నూటికి నూరుపాళ్లు నిజమని నమ్మారు. హత్యలు, సజీవ దహనాలు, మారణ కాండకు కారకులు ఎవరో నిర్ధారించలేకపోవడం మన విచారణా ప్రక్రియ విశిష్టత.

సినబ్బతో ఓ సాయంత్రం

మూడున్నర దశాబ్దాల కల. ఉదయం దిన పత్రికలో పచ్చనాకు సాక్షిగా చదువుతూ... "ఈ తిరప్తి బట్టను కలియాల్సిందే. ఇతగాడి అచ్చరాలు ప్రత్యేకంగా పుట్టాయబ్బా" అనుకొనుండాను ఆనాడు. ఇన్నాళ్లూ ఈ నామిని సుబ్రహ్మణ్య నాయుడ్ని సదివిందే తప్ప చూసింది లేదు. మధ్యలో కుటుంబంతో కలిసి తిరుపతి వచ్చినా "ఇప్పుడూ సాహిత్యమేనా "అన్న మాటలకి తలొగ్గి ఈ సినబ్బను కలవకుండానే వెనుతిరిగాను. ఇన్నాళ్లకు ఆ నా కల ఈడేరింది. తిరుపతి శివారు తనపల్లిలో ఉంటున్న నామిని సుబ్రహ్మణ్య నాయుడి దగ్గరకు తీసుకువెళ్లింది పెమ్మరాజు గోపాల కృష్ణ. ఇద్దరం ఆయన బండి మీద వెళ్లాం ఆ సాయంత్రం.

మెల్లకన్ను మనిషి అని తెలుసు కాని ఆకారానికి సంబంధించిన వివరాలేవి తెలియవు. ఫోన్ లో అడ్రస్ చెబుతూ " సరే అంటే ఎలాగబ్బా. సానా ఇబ్బంది పడతారు. మాట్లాడుతూ రండి. సందు తిరంగానే కాపడతా" అన్నారు సినబ్బ. సందు తిరగ్గానే కనపడ్డారు కూడా. తెల్లని గడ్డం. మాసిపోయి అసలు రంగు కోసం రీసెర్చి చేయాల్సిన ట్రాక్. ఎరుపు రంగే కాని వెలిసిపోయిన పార్టీ జెండాలా ఉన్న ఎర్ర టీ షర్టు. ఎంతటి వారైనా సరే కాళ్లకి దండం పెట్టడం, పెట్టించుకోవడం అసహ్యం నాకు. కాని, నామిని కనపడగానే అప్రయత్నంగా కాళ్లకు మొకరిల్లా. "ఎందబ్బా ఇది. వద్దు" అంటూ వెనక్కి వెనక్కి జరిగారు. నా భుజాలు పట్టుకుని పైకి లేపి కౌగలించుకున్నారు. నా గుండెలకి సినబ్బ తల తగిలింది. " మిట్టూరోడి కతలు" వంటివి ఈ జనమకి రాయలేం కాని సినబ్బ మనకంటే రెండు, మూడు గుప్పిళ్లు పొట్టోడే అని ఓ ఆత్మతృప్తి.

ఎవుసాయం మనిషి కదా... ఇంట్లోకి వెళ్లగానే గోనెసంచె మీద ఆరబెట్టిన తెల్ల ఉల్లిపాయలు. ఆ పక్కనే ప్లాస్టిక్ సంచీలో సగం వరకూ ఉన్న చోళ్లు. ఇద్దరం నేల మీద ఎదురెదురుగా కూర్చున్నాం. పక్కనే సోఫాలో పెమ్మరాజు గోపాలకృష్ణ. కూర్చున్నారు. నెపాన్ని కాసేపు మోకాళ్ల మీదకు నెట్టేస్తే... చెప్పబ్బా... అన్నారు నామిని. నాకు భయం కాదు

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

కాని.... నోట మాట రాలేదు. మూడు దశాబ్దాల పాటు తన సాహిత్యాన్ని నా వెంటేసుకుని తిరిగాను. "అవునూ....పతంజలంటే మీకు ఎందుకు కోపం..." అని అడిగాను. " తప్పబ్బా. నాకు కోపం ఏంది. ఓ హెడ్డింగ్ కోసం పతంజలి లాంటి వారితో గొడవ పడతామా. ఆయన నాకు దేవుడు. హీరో " అన్నారు నామిని. మరి తాడి ప్రకాష్ ఏదో రాసారు అని అడిగితే "ఈ పేసుబుక్కులో ఏదేదో రాసేశాడు. నేను కొత్తోడ్ని. నా చేత కాలం రాయించారు పతంజలి. ఎడిటర్‌తో గొడవ పడి మరీను" అన్నారు. "ఈ పిల్లాడి మీద అంత నమ్మకం ఏంటి నీకు అని ఎడిటర్ అడిగారు. అంతే కాదు... ఏం రాస్తాడు అని కూడా అడిగారు" అన్నారు. "నాకు తెలీదు ఏం రాస్తాడో. కానీ రాస్తాడు. పేలుతుంది. నాకు నమ్మకం ఉంది" అని గొడవ పడి నా చేత పచ్చనాకు సాక్షిగా రాయించారు పతంజలి. అది లేకపోతే నేను లేను కదబ్బా" అన్నారు.

రా.వి.శాస్త్రిని కూడా మీరు ఇష్టంలేదన్నారు. ఎందుకు అని అడిగితే... "అవునబ్బా. వాడు ఇరవై ఏళ్ల క్రితం ఇలా ఉండేవాడు, ఆమె కట్టుకున్న సీర ముప్పై ఏళ్ల క్రితం కొత్తది అంటూ రాస్తాడు. ఇప్పుడెందో రాయాలి కాని ఇదంతా ఏందీ" అన్నారు నామిని. అలాగే కారా మాస్టారు రాతలు కూడా నాకు నచ్చలేదు. అదేచెప్పా. "అంటే ఎలా రాయాలి" అని అడిగితే "ఎవరి బాష వారు రాయాలి. ఎవరి జీవితం వారేరాయాలి. అందుకే అలా రాయని వాళ్లంటే నాకు నచ్చదు. అదే చెప్పా. మా జిల్లా రచయిత ఓ పెద్దాయన కథల్లోను, నవలల్లోను ఓ క్యారెక్టర్‌కి ఆనందరావు అని పేరు పెట్టారు. మాజిల్లా అంతా యతకతా ఉన్నా ఇక్కడోళ్లెవ్వరూ ఆనందరావు అనే పేరుపెట్టరు. ఈ జిల్లా బాష, సంస్కృతి, అలవాట్లురాయాలి కాని, అరువు, ఎరువుతెచ్చుకుని రాయకూడదబ్బా" అన్నారు అదోలాంటి నవ్వుతో.

"మీ కథల్లో, నవలల్లో బూతు పదాలు రాసేస్తారు. చదివే వారికి ఇబ్బంది అనిపిస్తుంది కదా" అని అడిగితే... " అవి బూతులు కదబ్బా... ఆ పాత్రలు ఎలా మాట్లాడతాయో అదే రాసాను. అదే రాయాలి కూడా. పాత్రలకి నీ బాష తగిలించేస్తే ఎలా" అన్నారు. అలా అంటున్నప్పుడు ఆ మెల్లకన్నులోనూ ఓ మెరుపు మెరిసింది. ఇలా మాట్లాడుకుంటూంటూంటే "పబా... కాఫీ... తాగేందుకు నీళ్లు ఇస్తావా" అన్నారు నామిని. ఆ మాటలు ఇంకా నోట్లోంచి రాకుండానే మంచినీళ్లు తెచ్చారు పబావతి. ఆ తర్వాత కాఫీ కూడా. కాఫీ ఓ సిప్ చేశాకా " కాఫీ బాగుంది" అని పొగడ్తలాంటి కితాబు ఇచ్చారు పెమ్మరాజు. " పబావతి కాఫీ బాగా పెడుతుంది. అందుకే నేను ఇంకెక్కడా తాగను. ఇంట్లోనే తాగుతా" అని కేలీ ఇలాసంగా నవ్వారు నామిని.

"హైదరాబాద్ ఎందుకు వదిలేసారు" అని అడిగితే...."అది మంచి ఊరు కాదు. మనుషులని చంపేస్తుంది. పతంజలే ప్రత్యక్ష సాక్ష్యం. హైదరాబాద్ వచ్చాకే పతంజలి మారిపోయాడు. ఆయన అలవాట్లూ మారిపోయాయి. అక్కడే ఉంటే నేనూ అలాగే అయిపోదును" అన్నారు నామిని. ఇక బయలుదేరతామంటే...."రెండు చపాతీలు తిని పొండబ్బా. పబావతి చపాతీ కూడా బాగా చేస్తుంది" అన్న వాత్సల్యాన్ని సున్నితంగా కాదని సినబ్బ జ్ఞాపకాలతో వెనక్కి బయలుదేరాం.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

అంతర్యుద్ధంలో తల్లడిల్లుతున్న సూడాన్

సూడాన్‌లో మరోసారి అధికారం కోసం రెండు సైనిక విభాగాల మధ్య భీకరంగా అంతర్యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధంలో ఇప్పటి వరకు రెండు వందలకు పైగా అమాయక ప్రజల మరణించారు. రెండు వేలకు పైగా గాయపడ్డారు. ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ఇళ్ల నుంచి బయటకు రావటంలేదు. ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (అర్ఎస్ఎఫ్) ని సూడాన్ ఆర్మీలో విలీనం చేసేందుకు ఆర్మీచీఫ్ అబ్దల్ పత్తా బుర్హాన్ చేసిన ప్రతిపాదన ఈ అంతర్యుద్ధానికి దారి తీసింది. సైన్యంలోని తమ గ్రూపును విలీనం చేయరాదంటూ మహ్మద్ హమ్దాన్ దగా నేతృత్వంలోని ర్యాపిడ్ సపోర్ట్ దళాలు తిరుగుబాటు చేశాయి. ఈ ఆధిపత్య పోరులో దాగి ఉన్న నిజాలు ఏమిటి?

సూడాన్ సుదీర్ఘ కాలం బ్రిటిష్, ఈజిప్టు వలస దేశంగా ఉంది. వలస పాలనకు వ్యతిరేకంగా సూడాన్ ప్రజలు అనేక పోరాటాలు చేశారు. నిర్బంధాలను ఎదుర్కొన్నారు. 1953లో అన్ని వలస ఆస్తులపై పట్టు కోల్పోవటంతో బ్రిటిష్ ప్రభుత్వం సూడాన్‌కు స్వయం నిర్ణయాధికారం కల్పించి, 1955 చివరిలో సూడాన్ పార్లమెంట్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. ఆ విధంగా పోరాటాల ఫలితంగా 1956 సూడాన్ స్వతంత్ర దేశంగా అవతరించింది. 1956 జనవరి1 పీపుల్స్ ప్యాలెస్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈజిప్టు, బ్రిటన్ జండాలు దించి హరిత వర్ణం, నీలం, పసుపు చారల కూర్పుతో ఉన్న కొత్త జెండాను సూడాన్ తొలి ప్రధానమంత్రి ఇస్మాయిల్ అలు అజారీ ఎగురవేశాడు. నూతన ప్రభుత్వం పార్లమెంట్‌ని, రాజకీయ పార్టీలను రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. అజారీ ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించటంలో విఫలమైంది. అజారీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగి కర్నల్ గాఫర్ నామీరై ప్రధాన మంత్రి అయ్యాడు.

సూడాన్ దేశం తూర్పు- దక్షిణ ప్రాంతాలుగా ఉంటుంది. ఈ రెంటి మధ్య దశాబ్దాలుగా ఉన్న వైరుధ్యం, అపనమ్మకం 1950లో సాయుధ పోరాటానికి దారితీసింది. దక్షిణ సైనికాధికారులు 1955లో తిరుగుబాటూ చేశారు. ఇది సూడాన్ మొదటి అంతర్యుద్ధానికి నాంది పలికింది. దక్షిణ సూడాన్‌లో క్రిస్టియన్ జనసంఖ్య ఎక్కువ. కర్నల్ గాఫర్ ప్రభుత్వం క్రిస్టియన్లపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. ఆ ప్రాంత సహజవనరులను తరలించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా దక్షిణసూడాన్ ప్రజలు తిరుగుబాటు ప్రారంభించారు. ఫలితంగా 1972లో దక్షిణ సూడాన్ స్వతంత్ర ప్రాంతంగా ఏర్పడి 1983 వరకు కొనసాగింది. తర్వాత సూడాన్ లో రెండవ అంతర్యుద్ధం ప్రారంభమై 2005 శాంతి ఒడంబడికతో అక్కడ స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రభుత్వం ఏర్పడి 2011 జూలైలో దక్షిణ సూడాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది.

సూడాన్ దేశ ప్రధాన రంగం వ్యవసాయం. జొన్న ప్రధాన ఆహార పంట. నువ్వులు, వేరుశనగ పంటలను వ్యాపార పంటలగా సాగుచేస్తున్నారు. సూడాన్ 84 మిలియన్ హెక్టార్ల భూమి ఉంటే 20శాతం మాత్రమే సాగులో ఉంది. పెట్రోలియం గనులు అధికంగా ఉన్న దేశాలలో ఒకటి. బంగారు గనులతో పాటు అనేక ఖనిజాలకు ప్రసిద్ధ గాంచింది. ఇన్ని సహజ వనరులున్నా దేశంలో పేదరికం, నిరుద్యోగం తీవ్రంగా ఉంది. కరువుల మూలంగా లక్షలాది ప్రజలు ఇతర దేశాలకు వలస వెళ్లారు. 1989 సంవత్సరం ముందు వరకు ప్రధానిగా అధికారంలో ఉన్న సాదిక్ అల్ మహదీ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాన్ని అవకాశంగా తీసుకుని మాజీ సైనిక పారాట్రూపర్ బషీర్ 1989 తిరుగుబాటు చేసి అధికారాన్ని చేజిక్కించుకున్నాడు.

బషీర్ సైనిక నియంతృత్వ పాలనలో ప్రజలకు ఎటువంటి హక్కులు లేవు. ఇస్లామిస్టులతో అతని పొత్తు, ఆశ్రితులను రక్షించటానికి, భారీ అవినీతిని ప్రోత్సహించటానికి మిలీషియాలను ఏర్పాటు చేయటంలో అతనికి సహాయపడిన తీవ్రవాద జిహాదీలతో అతని పాలన అనుసంధానమైంది. మతం, జాతుల విద్వేషాలు రెచ్చగొట్టాడు. బషీర్ ప్రభుత్వం ధరలను అదుపు చేయటంలో విఫలమైంది. బ్రెడ్డు ధర మూడు రెట్లు పెరిగింది. మందుల, ఇంధనం ధరలు పెరిగాయి. ప్రజల్లో ఆగ్రహం ఏర్పడింది. విద్య, రవాణ వ్యవస్థల్లో వైఫల్యం, ఆర్థిక కష్టాలు, రాజకీయ అశాంతి ప్రజా తిరుగుబాటుని ప్రేరేపించాయి. బషీర్ నియంతృత్వ పాలన సూడాన్ చరిత్రలోనే అత్యంత దారుణమైంది. సూడాన్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా తూర్పు నగరం ఆర్బాటాలో ప్రారంభమై నిరసనలు దేశవ్యాపితంగా విస్తరించాయి. అధ్యక్ష పదవి నుంచి బషీర్ వైదొలగాలని ప్రజలు డిమాండ్ చేశారు. బషీర్ అనుకూల సైన్యాలు నిరసన కారులపై తీవ్ర హింసను ప్రయోగించి నాలుగు లక్షల దాకా ప్రజల ప్రాణాలు బలిగొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సైన్యం తిరుగుబాటు చేసి బషీర్‌ని గృహనిర్బంధం చేసింది. 30సంవత్సరాల బషీర్ నియంతృత్వ పాలన 11-4-2019లో ముగిసింది.

బషీర్ ప్రభుత్వం కూలి పోవటంతో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటుగా సాగాలని ప్రజలు డిమాండ్ చేశారు. కాని మిలటరీ, ప్రజల సంయుక్త భాగస్వామ్యంతో ప్రభుత్వం ఏర్పాటైంది. రెండేళ్ల ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్న తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేస్తానని చెప్పింది. 2021 అక్టోబర్ జనరల్ అబ్దల్ పత్తా అల్-బుర్హాన్ నేతృత్వంలో తిరుగుబాటుచేసి తాత్కాలిక ప్రభుత్వాన్ని రద్దు చేసింది. పౌర ప్రభుత్వ ప్రధాన మంత్రిని గృహ నిర్బంధం చేశారు. సార్వభౌమాధికార మండలిని రద్దు చేశారు. పౌర ప్రభుత్వ మంత్రులను, రాజకీయ పార్టీల సభ్యులను, న్యాయవాదులను, పౌర సమాజ కార్యకర్తలను, పాత్రికేయులను, మానవహక్కుల పరిరక్షణ నాయకులను అరెస్టు చేసి రహస్య ప్రదేశంలో ఉంచారు. ప్రజల పోరాటానికి ఒక లక్ష్యం లేకపోతే ప్రజానుకూల ప్రభుత్వ ఏర్పాటుకి భిన్నంగా ఒక దోపిడీ ప్రభుత్వ స్థానంలో మరో దోపిడీ ప్రభుత్వం ఏర్పడుతుంది. సూడాన్‌లో జరిగింది అదే. సూడాన్‌లో తిరిగి ప్రజా ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ చేపట్టేందుకు 2022 డిసెంబర్‌లో చర్చలు జరిగి, చర్చల ప్రతిపాదనలు ఆమోదించే దశలో చర్చలు విఫలమయ్యాయి. తాజాగా రెండు సైనిక విభాగాలు ఆధిపత్యం కోసం పోరాడుతున్నాయి.

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

బహుముఖ ప్రజ్ఞాశాలి పడాల రామారావు

స్వాతంత్ర్య సమరయోధులు, శతాధిక గ్రంధకర్త, అల్లూరి సీతారామ రాజు చరిత్ర పరిశోధకులు, కమ్యూనిస్టు ఉద్యమకారుడు, కార్మిక నాయకుడు, రంగస్థల నటులు, దర్శకుడు, సినీ రచయిత, పాత్రికేయుడిగా ఎనలేని సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి పడాల రామారావు. 1922, ఏప్రిల్ 22న సాంస్కృతిక నిలయంగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో పడాల వీరభద్రుడు, వీరమ్మ(పెంటమ్మ) దంపతులకు ప్రథమ సంతానంగా పేద చేనేత కుటుంబంలో జన్మించారు. విద్యలో ముందంజలో ఉండి, ఉత్తమ విద్యార్థిగా ఎదుగుతున్న తరుణంలో ఆర్థిక పరిస్థితుల రీత్యా 6వ తరగతితో చదువుకు స్వస్తిపలికి ఒక చింతపండు దుకాణంలో గుమస్తాగా చేరారు. ఆయన 16వ ఏటనే ఆయన మేనత్త కూతురు నాగరత్నంతో వివాహం జరిగింది. వివాహం అనంతరం అంచెలంచెలుగా చాలాచోట్ల పనిచేసి ఆర్థికంగా నిలద్రొక్కుకుని రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో సొంతంగా కిరాణాషాపును ప్రారంభించారు. రాజమండ్రి శాసనసభ్యులుగా పనిచేసిన కమ్యూనిస్టు నాయకుడు చిట్టూరి ప్రభాకర్ చౌదరి కెపిగా ప్రసిద్ధి చెందిన కొరపాటి పట్టాభిరామయ్య పరిచయాలతో వారి స్ఫూర్తితో పడాల కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులయ్యారు. కుటుంబంలో తండ్రి, తమ్ముడు కమ్యూనిస్టుపార్టీలో నీవు తిరగడానికి వీల్లేదని ఆంక్షలు విధించారు.

కమ్యూనిస్టు పార్టీని వదలడానికి పడాల ససేమీరా అంగీకరించలేదు. ఇంటి నుంచి వెళ్లిపోమన్నారు. భార్య, పిల్లలతో కట్టుబట్టలతో బయటకు వచ్చేసారు. అద్దె ఇంట్లో దిగారు. కుటుంబ పోషణకోసం షాపుల్లో గుమస్తాగా పనిచేసారు. పనికూడా నిలకడలేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పటికి ముగ్గురు పిల్లలు పుట్టారు. అందులో ఇద్దరు కవలలు. వారు క్రాంతి, జ్యోతి. అయితే ఆర్థిక కష్టాలు వెంటాడడంతో పాలు పట్టడానికి కూడా సొమ్ములు లేకపోవడంతో ఆ ఇద్దరు పిల్లలు చనిపోయారు. ఆయన స్వాతంత్ర్య పోరాటానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి దూరంకాలేదు. కెపి స్ఫూర్తితో మరింత ఉధృతంగా, ఉత్సాహంగా ముందుకు నడిచారు. 1942లో రాజమండ్రి జాంపేటలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘాన్ని ఏర్పాటుచేసారు. యువజన సంఘం ఆధ్వర్యంలో గాంధీజయంతి నిర్వహించి, బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో మొదటిసారి అరెస్టు అయ్యారు. 1944లో అదే సెంటర్‌లో బ్రిటీషు ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేయడంతో మరోసారి అరెస్ట్‌చేసి జైలుకు పంపారు. అప్పుడు భార్య నాగరత్నం చంటిపిల్లవాడితో రోడ్డున పడ్డారు. అయినా ఆమె పడాల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. ఆ సమయంలో ఆమె పినతండ్రి బత్తుల ముత్యం ఆమెను ఆదుకున్నారు. ఆయనకు పిల్లలు లేకపోవడంతో నాగరత్నంని కూతురుగా భావించి చేరదీసి పోషించాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కమ్యూనిస్టు పార్టీకి పూర్తిగా అంకితమై క్రియా శీలకంగా పనిచేసారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి గొప్ప వాగ్ధాటి కలిగి ఉండడంవల్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడ ఏ బహిరంగసభ జరిగినా పడాలనే ప్రధాన వక్తగా పిలిచేవారు.



పడాల రామారావు

స్వాతంత్ర్యం అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడంతో పడాలకు కష్టాలు తప్పలేదు. భార్య, బిడ్డలను వదలి రహస్యంగా గడపవలసి వచ్చింది. ఆ సమయంలో భార్య బిడ్డలను చూసుకోవడానికి వెళ్లిన సందర్భాల్లో రెండు, మూడు సార్లు అరెస్టు అయ్యారు. ఈ సందర్భంగా ఇక్కడ ఆయన సతీమణి నాగరత్నం ఇంటిని ఎందరో కమ్యూనిస్టు నేతలకు స్థావరంగా చేసి కాపాడింది. 1948-50 సంవత్సరాల్లో కడలూరు జైల్లో జీవితాన్ని గడిపిన పడాల జైలులో అన్ని రాష్ట్రాలకు చెందిన మేధావులైన రాజకీయ ఖైదీల వద్ద ఇంగ్లీషు, హిందీ, తమిళం తదితర భాషలు నేర్చుకోవడంతో పాటు సాహిత్యంపై మెళకువలు నేర్చుకుని జ్ఞానాన్ని సముపార్జించారు. ఆ మెళకువలతోనే జైల్లో ఉండగానే "ఖైదీ" అనే నవలను రాశారు. అలా సాహిత్యానికి శ్రీకారం చుట్టిన పడాల కలం నుండి 102 గ్రంథాలు జాలువారాయి. అందులో పేరెన్నిక గన్నది అల్లూరి సీతారామరాజు చరిత్ర 'ఆంధ్రశ్రీ' నవల. మల్లుదొర విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం నుండి 1952, 1957లో పోటీ చేసినప్పుడు పడాల ఆయనకు సహాయకుడిగా పనిచేసారు. మల్లుదొర 1952 గెలుపొందగా, 1957లో ఓడిపోయారు. అల్లూరి సీతారామరాజు చరిత్రను సినిమాగా తీయడానికి నందమూరి తారకరామారావు ముందుకు వచ్చి 1956లో పడాలచే ఒప్పందం కుదుర్చుకుని ఆయనతో స్క్రీన్‌ప్లే, కొన్ని పాటలు రాయించుకుని, 1957లో మద్రాసు విజయాగార్డెన్స్‌లో చిత్ర నిర్మాణానికి శ్రీకారం, పాట రికార్డు చేశారు. అయితే అనివార్య కారణాల వల్ల చిత్ర నిర్మాణం ఆగిపోయింది. ఆ కాలంలో 6 సంవత్సరాల పాటు పడాల మద్రాసులో నివాసం ఉన్నారు. రాజమండ్రి వచ్చి వెళ్తుండేవారు. ఎన్‌టిఆర్‌కు సాహిత్య సలహాదారునిగా ఉండేవారు. ఆ కాలంలో పడాలకు హిందీ భాష తెలిసుండడంతో 1958లో నీలవేణి, శ్రీకృష్ణలీలలు సినిమాలను తర్జుమాచేసి మాటలు రాసారు.

మద్రాసులో ఉంటూ బతుకు తెరువు కోసం ఎన్నో డిటెక్టివ్ నవలలు రాశారు. మద్రాసు నుంచి రాజమండ్రికి మకాం వచ్చేసారు. కమ్యూనిస్టు పార్టీపై, కార్మిక సంఘాలపై కేంద్రీకరించారు. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాజమండ్రి నగర కార్యదర్శిగా పనిచేసారు. రాజమండ్రిలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ భవనం పడాల కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆయన సారధ్యంలో నిర్మితమైనదే. అలాగే ఎఐటియుసిలో జాతీయ కౌన్సిల్ సభ్యునిగా పనిచేసారు. సొంతంగా కార్మిక సంఘాలను నిర్మించారు. ఆయన రచనలు చేసిన నాటకాలను ముందుగా ప్రదర్శనలు ఇచ్చి, ఆ తర్వాత ముద్రింపబడేవి. ఆ నాటకాల్లో పడాల ఏదో పాత్ర పోషించేవారు. అల్లూరి సీతారామరాజు నాటకంలో సింగన్న పాత్ర వేసేవారు. అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేసారు. పాత్రికేయునిగా 1959 నుంచి 1971 వరకు 'చౌ-చౌ' అనే మాస, పక్షపత్రిక నడిపారు. పాత్రికేయునిగా పడాలను ఆనాటి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఎల్.మాలకొండయ్య కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా సన్మానంచేసి, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రాజమండ్రిలో 200 గజాల స్థలంలో ఇంటిని నిర్మించి ఇచ్చారు. పడాల రాసిన అల్లూరి సీతారామరాజు నాటకాన్ని ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు, కళాతపస్వి డా.గరికిపాటి రాజారావు సినిమా సాంకేతికతో ప్రదర్శనలు ఇచ్చారు. హైదరాబాద్ సెక్రటేరియట్ కల్చరల్ అసోసియేషన్ అధికారులు హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శన ఇవ్వగా రాష్ట్రపతి వి.వి.గిరి ప్రదర్శనను చివరివరకు తిలకించి పడాలను శ్లాఘిస్తూ ఘనంగా సన్మానించారు. ఆనాడు సీతారామరాజు పాత్రను సినీ హీరో శ్రీధర్ వేసారు. 1982లో నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి పడాలను పార్టీలోకి ఆహ్వానించి, ఎంఎల్ఎగా పోటీ చేయమని కోరారు. అయితే పడాల అందుకు సున్నితంగా తిరస్కరించారు. నా చివరి శ్వాసవరకు కమ్యూనిస్టు పార్టీలోనే ఉంటానని, తనను బలవంతం పెట్టవద్దని ఎన్‌టిఆర్‌కు విన్నవించారు. తర్వాత తెలుగుదేశం పార్టీ విజయం సాధించి, ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే పడాలతో ఉన్న స్నేహ బంధాన్ని మరచిపోకుండా ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రి హోదాలో హైదరాబాద్ రవీంద్రభారతిలో అల్లూరి సీతారామరాజు 86వ జయంత్యుత్సవాన్ని జరిపి, పడాలకు ఘన సన్మానం చేసారు.

గోర్కి 'అమ్మ' మార్క్స్ ట్రేడ్ నవలలు తర్జుమా చేశారు. పడాల చేసిన సాహిత్య సేవలకుగాను సోవియట్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు 1977లో సోవియట్ యూనియన్ 9 రోజులపాటు సందర్శించారు. 1982లో పడాల షష్టిపూర్తి ఉత్సవం రాజమండ్రిలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిధిగా అఖిల భారత విప్లవ కారులు సంఘం ప్రధాన కార్యదర్శి, భగత్‌సింగ్ సహచరుడు, అండమాన్ జైలులో యావజ్జీవ ఖైదు అనుభవించిన విజయకుమార్ సిన్హా పాల్గొన్నారు. 2020లో తంతి తపాలశాఖ స్వాతంత్ర్య సమరయోధులుగా శతాధిక గ్రంథకర్తగా పడాల రామారావును గుర్తిస్తూ ఆయన పేరున ప్రత్యేక పోస్టల్ కవర్‌ను విడుదల చేసింది. పడాలలో తీరని కోరిక ఒకటి ఉండేది. అది ఆయనకు ఖ్యాతి తీసుకువచ్చిన 'ఆంధ్రశ్రీ' నవల అల్లూరి సీతారామరాజు చరిత్రను ఆంగ్లంలో గ్రంథస్థం చేయాలనుకునే కోరిక నెరవేరలేదు. చివరిగా చిన్నప్పటి నుండి కలిసి తిరిగిన మేనత్త కూతురు చివరివరకు సహజీవనం సాగిస్తుందనుకున్న భార్య నాగరత్నం 25 జూలై 1999లో ఆయన కంటే ముందుగా మరణించడాన్ని తట్టుకోలేకపోయి.. ఆయన కృంగిపోయి..2006, ఏప్రిల్ 4న తుది శ్వాస విడిచారు.

(నేడు పడాల రామారావు శత జయంత్యుత్సవాల సందర్భంగా..)

- పడాల వీరభద్రరావు.తూ॥గో॥జిల్లా అరసం అధ్యక్షులు

సెల్ : 9493281776.

తమిళనాట అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల నిరసన విజయవంతం

చెన్నై: అంగన్వాడీ కేంద్రాల విలీనం, తక్కువ వేతనం, పెన్షన్ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్స్ చేపట్టిన ఆందోళన విజయవంతమైంది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ప్రధాన కేంద్రాల్లో అంగన్వాడీలు, హెల్పర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. సెంటర్ ఫర్ ట్రేడ్ యూనియన్ (సిఐటీయు) అనుబంధ సంస్థ అయిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఎడబ్ల్యుహెచ్‌యు) ఈ నిరసనకు నేతృత్వం వహించింది. టైం స్కేల్ వేతనంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, హామీ ఇచ్చిన పెన్షన్, పిఎఫ్ మొత్తాన్ని పెంచాలని గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. తక్కువ పిల్లలు ఉన్న కేంద్రాలను విలీనం చేయడం, 15 మంది కంటే తక్కువ పిల్లలు ఉన్న కేంద్రాలను మినీ కేంద్రాలుగా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయం గ్రామీణ, గిరిజన ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకుని అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉగ్రవాదుల కోసం వేట

దాడిలో ఏడుగురు టెర్రరిస్టులు: సైన్యం

పూంచ్: ఉగ్రదాడి జరిగిన జమ్ముకశ్మీరులోని పూంచ్ ప్రాంతంలో కేంద్రం హైఅలర్ట్ ప్రకటించింది. కేంద్ర పారామిలటరీ బలగాలు ఎలాంటి కదలికలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంమంత్రిత్వశాఖ కోరింది. జమ్ములోని అంతర్జాతీయ సరిహద్దులతో పాటు దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్, ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా, యూరి సెక్టార్‌లలో ఉగ్రవాదులు పాక్ వైపు నుంచి తిరిగి చొరబడకుండా హై అలర్ట్ ప్రకటించారు. ఉగ్రదాడికి పాల్పడింది పాకిస్తాన్‌కు చెందిన సరిహద్దు యాక్షన్ టీం అని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. రెండు గ్రూపులకు చెందిన ఏడుగురు ఉగ్రవాదుల ప్రమేయం ఉన్నట్లు పేర్కొన్నాయి. గతంలో రాజౌరి, పూంచ్ సెక్టార్లలో సైన్యం, పౌరులపై ఇదే విధంగా పాక్‌కు చెందిన బార్డర్ యాక్షన్ టీం రెండు సార్లు దాడులకు పాల్పడినట్లు వారు తెలిపారు. తాజా ఉగ్రదాడి దాడి అనంతరం భారత భద్రతా దళాలు మెంధార్ సబ్-డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో ఉగ్రవాదుల కోసం పెద్ద ఎత్తున గాలింపు ప్రారంభించాయి. సైన్యం, పోలీస్ సీనియర్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భారీగా బలగాలను మోహరించారు. భాటా ధురియన్, నార్ ఫారెస్ట్, సంజియోట్, కోటన్‌తో సహా వివిధ గ్రామాలను భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. సాయుధ పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. ఉగ్రదాడి తర్వాత భింబర్ గలి, భాటా ధురియన్ మధ్య జాతీయ రహదారిపై అన్ని రకాల వాహనాల రాకపోకలు నిలిపివేశారు. భటా ధురియన్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో భింబర్ గలి నుంచి సురన్‌కోట్ రోడ్డు వరకు ట్రాఫిక్‌ను నిలిపివేస్తున్నట్లు పూంచ్ జిల్లా పోలీసులు తెలిపారు. శ్రీనగర్‌లో జీ20 సమావేశాలు జరగనున్న తరుణంలో ఈ దాడి జరిగింది. జీ20 సమావేశాల నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిని సమీక్షించడానికి గతవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

పూంచ్ ఉగ్రదాడిలో చైనా, పాక్ పాత్ర?

జమ్ముకశ్మీరులోని పూంచ్ ఉగ్రదాడిలో తవ్వే కొద్దీ కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఈ ఉగ్ర దాడికి దండగులు స్టీలు బుల్లెట్లు వాడినట్లు శుక్రవారం వెల్లడైంది. దీంతో ఈ దాడి వెనుక పాకిస్తాన్, చైనా దేశాల హస్తముందని భారత సైన్యం భావిస్తోంది. నిన్న జరిగిన ఉగ్రదాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయిన పూంచ్‌లోని భింబర్ గలి వద్ద బాంబు నిర్వీర్య దళం, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ పోలీసులు శోధిస్తున్నారు. తీవ్రవాదుల జాడ కోసం భారత జవాన్ల గాలింపులో భాగంగా డ్రోన్లు, స్నిఫర్ డాగ్‌లను ఉపయోగిస్తున్నారు.

ఐదుగురు జవాన్లను హతమార్చిన ఉగ్రవాదుల జాడ కోసం శుక్రవారం జమ్ము కశ్మీర్‌లోని బటా-డోరియా ప్రాంతంలోని అడవుల్లో శోధిస్తున్నారు. మూడు వైపుల నుంచి కాల్పులు జరిగాయి. తర్వాత గ్రెనేడ్ దాడి జరిగింది. ఇంధన ట్యాంక్‌కు మంటలు అంటుకున్నాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై లైంగిక దాడి

చెన్నై: తమిళనాడులోని తిరుచ్చి జిల్లా మణప్పారై ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల ఓ యువకుడు... ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అతను పని మీద పుత్తానందం నుంచి మణప్పారైకి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. కాగా ఇదే బస్సులో ప్రయాణిస్తున్న పండ్లిపేట్లీకు చెందిన అరివళగన్ అనే యువకుడి కారణంగా ఊహించని సమస్య వచ్చి పడింది. బస్సులో ఏం జరిగిందో ఏమో తెలీదు గానీ.. అరివళగన్ ఉన్నట్టుండి తన స్నేహితులకు ఫోన్ చేశాడు. బస్సులో ఐటీ ఉద్యోగి తనపై దాడి చేశాడని, బస్సు మణప్పారైకి వచ్చేలోపు అక్కడికి రావాలని చెప్పాడు. దీంతో అతడి స్నేహితులు బస్సు కోసం వేచి చూస్తూ ఉన్నారు. బస్సు రాగానే లోపల ఉన్న ఐటీ ఉద్యోగిని బలవంతంగా కిందకు దించి, నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ అతడిపై అంతా కలిసి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను మొత్తం వీడియో కూడా తీశారు. తమకు రూ.75వేల నగదు ఇవ్వాలని, లేదంటే వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తామని బెదిరించారు. దీంతో భయపడిపోయిన ఐటీ ఉద్యోగి.. వారు అడిగిన మొత్తాన్ని ఇచ్చేశాడు. అనంతరం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అరివళగన్‌తో పాటూ ముహమ్మద్, అరుణ్‌కుమార్, లియోబ్లాయిడ్, సెంథిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో సెంథిల్‌కుమార్ అనే వ్యక్తి గతంలో ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

ప్రముఖుల ట్విట్టర్ ఖాతాల్లో బ్లూటిక్ మాయం

న్యూఢిల్లీ: ప్రముఖుల ట్విటర్ ఖాతాల్లో బ్లూటిక్ మాయమైంది. దీంతో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లు ఉన్న ప్రముఖులు ట్విటర్ చర్యతో దిగ్భ్రాంతికి గురవుతున్నారు. బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, షారూఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, టాలీవుడ్ నటులు చిరంజీవి సహా క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఖాతాల్లో గురువారం నుండి బ్లూటిక్ మాయమైంది. హీరోయిన్‌లు సమంత, అలియా భట్‌లతో పాటు రాజకీయ నాయకుల్లో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏపీ సీఎం జగన్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, మమతా బెనర్జీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, టీడీపీ అధ్యక్షుడు అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ట్విట్టర్ బ్లూటిక్ కోల్పోయిన వారి జాబితాలో ఉన్నారు. అనేక మీడియా సంస్థలకు కూడా బ్లూటిక్ తొలగించింది. ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేయకముందు భారతీయ వినియోగదారులకు ఆ మైక్రోబ్లాగింగ్ సైట్ ఉచితంగా బ్లూటిక్ అందించేది. ట్విటర్‌ను సొంతం చేసుకున్న అనంతరం ఎలన్‌మస్క్ నిబంధనలు మార్చారు. బ్లూటిక్ కావాలంటే పేమెంట్ చేయాల్సిందేనని ప్రకటించారు. సబ్‌స్క్రైబ్ చేసుకోని వారి ఖాతాకు బ్లూటిక్ తొలగిస్తామని ఇటీవలే ట్విటర్ ప్రకటన జారీ చేసింది. దీంతో గురువారం నుండి ప్రముఖుల ఖాతాల నుండి బ్లూటిక్ ఎగిరిపోయింది.

కాక్‌పిట్‌లో పైలట్ స్నేహితురాలు

న్యూఢిల్లీ: దుబాయి నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానంలో ఓ పైలట్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడడంతో అతడిపై విచారణకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విచారణ ప్రారంభించింది. విమానం గాలిలో ఉన్న సమయంలో దాని పైలట్ తన స్నేహితురాలిని కాక్‌పిట్ లోకి రమ్మనడమే కాకుండా అందులోనే ఆమెను చాలా సేపు ఉంచాడు. ఫిబ్రవరిలో చోటుచేసుకున్న ఈ ఘటన నిబంధనలను ఉల్లంఘించడమేనని సంబంధిత అధికారులు చెప్పారు. దీనిపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఆ విమానంలో తన స్నేహితురాలు ప్రయాణిస్తుండడంతో ఆమెను పైలట్ కాక్‌పిట్ లోకి ఆహ్వానించాడని అధికారులు గుర్తించారు. విమానం దుబాయి నుంచి బయలుదేరిన వెంటనే ఈ ఘటన చోటుచేసుకుంది. దాదాపు మూడు గంటల పాటు ఆమె కాక్‌పిట్లోనే ఉంది. ఇది భద్రతా నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదని, విమానం, ప్రయాణికుల రక్షణ విషయాన్ని గాలికి వదిలేసినట్లేనని అధికారులు అన్నారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన పైలట్ పై క్షమశిక్షణ చర్యలే కాకుండా, అతడి లైసెన్స్‌పై సస్పెన్షన్ లేదా దాన్ని రద్దు చేసే అవకాశం ఉందని వివరించారు. విచారణలో తేలే విషయాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎయిర్ ఇండియా విమానాలు వరుసగా అనేక వివాదాల్లో చిక్కుకుంటూ వార్తల్లోకెక్కుతున్నాయి.

ఢిల్లీ కోర్టులో మహిళపై కాల్పులు

న్యూఢిల్లీ: ఢిల్లీ కోర్టులో ఓ మహిళపై కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. ఈ ఘటనలో మహిళ సహా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, వారిని వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు సీనియర్ పోలీస్ అధికారులు తెలిపారు. దక్షిణ ఢిల్లీలోని సాకేత్ కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. న్యాయవాది దుస్తుల్లో వచ్చిన ఓ వ్యక్తి మహిళపై నాలుగు రౌండ్లు కాల్పులు జరిపిన అనంతరం క్యాంటీన్ వెనుక ద్వారం నుంచి పరారైనట్లు అధికారులు తెలిపారు. ఆర్థిక వివాదానికి సంబంధించిన కేసు విచారణ నిమిత్తం ఆ మహిళ కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదితో మాట్లాడుతుండగా...గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు జరిపినట్లు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం నిందితుడు వృత్తి రీత్యా న్యాయవాది అని, ప్రస్తుతం బార్ కౌన్సిల్ నుండి సస్పెండ్ అయినట్లు తెలుస్తోంది. గతేడాది జులైలో సాకేత్ పోలీస్ స్టేషన్‌లో ఆ మహిళపై నిందితుడు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఆ అధికారి తెలిపారు. గాయపడిన మహిళ తన నుండి రూ.25 లక్షలు అప్పుగా తీసుకుందని, అధిక మొత్తంతో తిరిగి చెల్లిస్తానని ఒప్పందం చేసుకుని మోసం చేసినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

ఈశ్వరప్పకు మోదీ ఫోన్

బెంగళూరు: కర్నాటక సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్పకు స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్ చేశారు. పార్టీ నిర్ణయాన్ని ఆమోదించి, పార్టీ పట్ల విధేయతను, చిత్తశుద్ధిని చాటుకున్నందుకు ఆయనకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. శివమొగ్గ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈశ్వరప్పకు బీజేపీ ఈసారి టికెట్ నిరాకరించడంతో ప్రధాని స్వయంగా ఫోన్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'మీరు కూడా నా తరహాలోనే ఒక సాధారణ కార్యకర్తగా చెప్పుకోవడం గర్వంగా అనిపించింది' అని ప్రధాని తనతో మాట్లాడిన వీడియోను ఈశ్వరప్ప షేర్ చేశారు. మీరు (ఈశ్వరప్ప), బీఎస్ యడియూరప్ప పార్టీకి గణనీయమైన సేవలు చేశారని ప్రధాని ఆ వీడియోలో ప్రశంసించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈశ్వరప్ప ఆరోసారి కూడా ఎన్నికల్లో పోటీ చేయాలని అభిలషించినప్పటికీ, ఈవారం మొదట్లో విడుదల చేసిన జాబితాలో ఆయన పేరు చోటుచేసుకోలేదు. శివమొగ్గ సిటీ కార్పొరేషన్‌కు చెందిన చెన్నబసప్పకు ఈశ్వరప్ప నియోజకవర్గాన్ని కేటాయించారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి చెన్నబసప్పకు తాను ప్రచారం చేస్తానని ప్రధాని మోదీకి ఈశ్వరప్ప తెలియజేశారు. కర్నాటకలో బీజేపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కాగా, పార్టీకి తాను చేసిన సేవలకు ప్రధానమంత్రి నుంచి ప్రశంసలు వస్తాయని, ఆయన ఫోన్ చేస్తారని ఊహించలేదని ఈశ్వరప్ప తెలిపారు. మోదీ ప్రదర్శించిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు మే 10న జరుగనుండగా, మే 13న ఫలితాలు వెలువడతాయి.

నా వసతిని మార్చండి

సుప్రీంకు గృహ నిర్బంధంలో ఉన్న గౌతమ్ నవలఖ

న్యూఢిల్లీ: ఎల్గార్ పరిషత్-మావోయిస్టులతో సంబంధాల కేసులో తనను గృహనిర్బంధంలో ఉంచిన ముంబైలోని పబ్లిక్ లైబ్రరీ నుంచి నగరంలోని వేరే ప్రదేశానికి తరలించాలని కోరుతూ హక్కుల కార్యకర్త గౌతమ్ నవలఖ శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పబ్లిక్ లైబ్రరీని ఖాళీ చేయవలసిన అవసరం ఉందని న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నతో కూడిన ధర్మాసనానికి నవలఖ తరపు న్యాయవాది తెలిపారు. 'నేను కోరుతున్నది ముంబైలోనే అతని గృహ నిర్బంధ చిరునామా (స్థలం) మార్పు' అని నవలఖ న్యాయవాది అత్యవసర విచారణను అభ్యర్థించారు. కోర్టులో మరో కేసులో హాజరవుతున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు... దరఖాస్తు ప్రస్తావన గురించి తనకు తెలియదని, దానిపై స్పందించడానికి సమయం కావాలని కోరారు. దీనిపై వచ్చే శుక్రవారం విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. నవంబరు 10, 2022న ఈ కేసుకు సంబంధించి నవీ ముంబైలోని తలోజా జైలులో ఉన్న నవలఖ ఆరోగ్యం క్షీణించడంతో గృహ నిర్బంధంలో ఉంచడానికి సుప్రీం కోర్టు అనుమతించింది. ఈ ప్రముఖ కార్యకర్త ఏప్రిల్ 14, 2020 నుంచి కస్టడీలో ఉన్నారని, అతని వైద్య నివేదికను తిరస్కరించడానికి ప్రాథమికంగా ఎటువంటి కారణం లేదని పేర్కొంటూ, నవలఖకు ఈ కేసు మినహా ఎటువంటి నేర నేపథ్యం లేదని, భారత ప్రభుత్వం కూడా అతనిని మధ్యవర్తిగా నియమించిందని పేర్కొంది. మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. భద్రతా ఖర్చుల కింద రూ.2.4 లక్షలు డిపాజిట్ చేయడంతో సహా అనేక షరతులను విధిస్తూ, 70 ఏళ్ల కార్యకర్తను ముంబైలో నెల రోజుల పాటు గృహ నిర్బంధంలో ఉంచాలన్న ఆదేశాలను 48 గంటల్లో అమలు చేయాలని సుప్రీం కోర్టు పేర్కొంది. నవంబర్ 10, 2022 ఆర్డర్ నుంచి అత్యున్నత న్యాయస్థానం అతని గృహ నిర్బంధ కాలాన్ని చాలాసార్లు పొడిగించింది. ఫిబ్రవరి 17న నవలఖ గృహ నిర్బంధంలో ఉన్న ముంబై నుంచి ఢిల్లీకి తరలించాలని కోరుతూ తన దరఖాస్తును సుప్రీంకోర్టు నుంచి ఉపసంహరించుకున్నారు. ముంబైలో ఉండేందుకు వేరే స్థలాన్ని వెతుక్కుంటానని నవలఖ తన న్యాయవాది ద్వారా సుప్రీంకోర్టుకు తెలిపారు. జనవరి 9న నవలఖను గృహనిర్బంధంలో ఉంచుతూ తన మధ్యంతర ఉత్తర్వులు తదుపరి విచారణ తేదీ వరకు కొనసాగుతాయని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది.

గోధ్రా రైలు దహనం కేసులో

8 మంది దోషులకు బెయిల్

మరో నలుగురికి తిరస్కరించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : గుజరాత్‌లో 2002లో జరిగిన గోధ్రా రైలు దహనం కేసులో జీవిత ఖైదీలుగా ఉన్న ఎనిమిది మందికి సుప్రీం కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే ఈ కేసులో వారి కీలక పాత్ర దృష్ట్యా మరో నలుగురికి బెయిల్ నిరాకరించింది. ఫిబ్రవరి 2002లో గుజరాత్‌లోని గోధ్రాలో రైలు కోచ్‌ని తగులబెట్టి, రాష్ట్రంలో అల్లర్లను ప్రేరేపించడంతో 59 మంది మరణించారు. గుజరాత్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ రైలు దహనం కేసులో నలుగురు నిందితుల పాత్ర కారణంగా వారి బెయిల్ దరఖాస్తులో తనకు కొన్ని సమస్యలు ఉన్నాయని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని న్యాయమూర్తి పి.ఎస్.నరసింహతో కూడిన ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాగా జీవిత ఖైదు పడిన వీరంతా దాదాపు 17 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారు. మెహతా నలుగురికి బెయిల్‌ను వ్యతిరేకిస్తూ, వారిలో ఒకరి నుంచి ఇనుప పైపును స్వాధీనం చేసుకున్నారని, మరొక నిందితుడి నుంచి ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నామని, ఇది కర్రపై అమర్చిన కొడవలి. మరో నిందితుడు కోచ్‌ను కాల్చడానికి ఉపయోగించిన పెట్రోల్‌ను కొనుగోలు చేసి నిల్వ చేసి తీసుకెళ్లాడని, చివరి నిందితుడు ప్రయాణికులపై దాడి చేసి దోచుకున్నాడని తన వాదనలను వినిపించారు. మెహతా బెయిల్‌ను వ్యతిరేకించిన నలుగురు దోషుల బెయిల్ దరఖాస్తులపై విచారణను వాయిదా వేయవచ్చని, ఇతర దోషులకు బెయిల్ మంజూరు చేయవచ్చని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే సూచించారు. శనివారం పండుగ ఉన్నందున తాను ప్రత్యేకంగా ఈ సూచన చేశానని హెగ్డే తన వాదనలను కొనసాగించారు. నలుగురు దోషుల బెయిల్ దరఖాస్తులను రెండు వారాల తర్వాత విచారించాలని ధర్మాసనాన్ని కోరారు. వారి తరపున వాదనలు చేయవలసి ఉందని చెప్పారు. నలుగురు నిందితుల బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయవద్దని, వారి బెయిల్ దరఖాస్తులపై విచారణను వాయిదా వేయాలని మరో సీనియర్ న్యాయవాది కూడా ధర్మాసనాన్ని కోరారు. అయితే నలుగురు దోషుల బెయిల్ దరఖాస్తులను కోర్టు కొట్టివేయాలని మెహతా ఒత్తిడి చేశారు. ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం తర్వాత ఈ దరఖాస్తులను పునరుద్ధరించడానికి కోర్టు వారికి అనుమతిని ఇవ్వవచ్చని విన్నవించారు. వాదనలు విన్న ధర్మాసనం ఎనిమిది మంది దోషులకు బెయిల్ మంజూరు చేయగా, నలుగురు దోషులకు బెయిల్‌ను తిరస్కరించింది. విచారణను ముగించి, బెయిల్ మంజూరు చేసిన ఎనిమిది మంది పిటిషనర్ల ధర్మాసనం... 'సెషన్స్ కోర్టు విధించే అటువంటి షరతులకు లోబడి వారిని బెయిల్‌పై విడుదల చేయాలని మేము నిర్దేశిస్తున్నాము' అని పేర్కొంది.

అవినీతికి బీజేపీ ఆమోదం

మోదీతో వీడియోలో ఈశ్వరప్ప మాట్లాడటంపై కాంగ్రెస్

న్యూఢిల్లీ : రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ నిరాకరించిన కర్నాటక మాజీ మంత్రి కె.ఎస్.ఈశ్వరప్పను ప్రధాని నరేంద్ర మోదీ సంప్రదించిన తర్వాత బీజేపీ అవినీతిని సమర్థిస్తోందని కాంగ్రెస్ శుక్రవారం ఆరోపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వనప్పటికీ తిరుగుబాటు చేయనందుకు ఈశ్వరప్పను ప్రధాని మోదీ అభినందించడం ఆమోదయోగ్యం కాదని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. ఈశ్వరప్ప ఏప్రిల్ 2022లో కర్ణాటక గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ మంత్రిగా పదవీ విరమణ చేశారు. బెలగావిలో పబ్లిక్ వర్క్‌లో 40 శాతం కమీషన్ వసూలు చేశారని ఈశ్వరప్పపై ఆరోపణలు చేసిన తర్వాత సంతోష్ పాటిల్ అనే కాంట్రాక్టర్ తన జీవితానికి ముగింపు పలికాడు. విచారణ అనంతరం ఈశ్వరప్పకు క్లీన్‌చిట్ ఇచ్చింది. మాజీ మంత్రి ఎన్నికల రాజకీయాల నుంచి విరమించుకోవాలని తన కోరికను ఇటీవల బీజేపీ కేంద్ర నాయకత్వానికి తెలిపారు. అయితే తన కుమారుడు కె.ఇ.కాంతేష్‌కు టికెట్ కోరినట్లు సమాచారం. అయితే సీనియర్ నేత అభ్యర్థనను పట్టించుకోకుండా పార్టీ చన్నబసప్పకు టికెట్ ఇచ్చింది. 'ఈ వ్యక్తి 40 శాతం కమీషన్ డిమాండ్ చేశాడని బీజేపీ కార్యకర్త సంతోష్ పాటిల్ ఆత్మహత్య చేసుకున్న తర్వాత అవినీతి ఆరోపణలతో బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చింది' అని కాంగ్రెస్ శుక్రవారం ట్విట్టర్‌లో పేర్కొంది. అటువంటి అవినీతి నాయకులను ప్రశంసించడం ద్వారా బీజేపీ అవినీతి, చట్టవిరుద్ధ కార్యకలాపాలను సమర్థిస్తున్నట్లు స్పష్టమైన సందేశాన్ని పంపుతోంది' అని కాంగ్రెస్ శుక్రవారం ట్విట్టర్‌లో పేర్కొంది. మోదీతో ఫోన్‌లో మాట్లాడుతున్న వీడియోను ఈశ్వరప్ప షేర్ చేయడంతో ఈ విమర్శల దాడి జరిగింది. వీడియోలో, ప్రధాని మాట్లాడుతూ 'మీరు పార్టీ పట్ల మీ నిబద్ధతను ప్రదర్శించారు. నేను మీతో చాలా సంతోషంగా ఉన్నాను. అందువల్ల నేను మీతో మాట్లాడాలని నిర్ణయించుకున్నాను' అని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో కర్నాటకలో పర్యటించినప్పుడల్లా ఈశ్వరప్పను కలుస్తానని మోదీ చెబుతున్నట్లు కూడా వినిపిస్తోంది. మే 10న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఈశ్వరప్ప ప్రధానికి సమాధానంగా చెప్పారు. ప్రధానికి అవినీతితో ఎలాంటి ఇబ్బంది లేదని జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చేసిన వ్యాఖ్యలను ఇది రుజువు చేస్తుందని కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలా బెంగళూరులో అన్నారు. ప్రధానికి ఈశ్వరప్పతో మాట్లాడినప్పుడు, సంతోష్ పాటిల్‌తో గానీ లేదా అతని కుటుంబ సభ్యులతోగానీ మాట్లాడే తీరిక లేదని అన్నారు. సత్యపాల్ మాలిక్ వ్యాఖ్యలను కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ప్రస్తావిస్తూ... ఓట్ల కోసమే మంత్రి పదవి నుంచి తొలగించిన నాయకుడి మద్దతును ప్రధాన మంత్రి కోరుతున్నారని తెలిపారు.

ఎందుకీ ప్రతీకారం?

కఠిన చట్టం కింద యూట్యూబర్ నిర్బంధంపై సుప్రీం

న్యూఢిల్లీ : మదురై సెంట్రల్ జైలు నుంచి దక్షిణాది రాష్ట్రంలో వలస కూలీలపై దాడులు జరుగుతున్నాయని నకిలీ వీడియోలను ప్రసారం చేసినందుకు అరెస్టయిన యూట్యూబర్ మనీష్ కశ్యప్‌ను తరలించవద్దని తమిళనాడు ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశించింది. జాతీయ భద్రతా చట్టం కింద తనను నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ కశ్యప్ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహతో కూడిన ధర్మాసనం తమిళనాడు, బీహార్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. 'ఆర్టికల్ 32 కింద కోరిన ఉపశమనం కాకుండా, జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద నిర్బంధ ఉత్తర్వును సవాలు చేయాలని పిటిషనర్ కోరుతున్నారు. పిటిషన్‌ను సవరించేందుకు పిటిషనర్‌కు అనుమతి ఉంది. సవరించిన ప్రార్థనలపై నోటీసు జారీ చేయండి. పిటిషనర్‌ను మధురై సెంట్రల్ జైలు నుంచి తరలించవద్దని మేము ఆదేశిస్తున్నాము' అని ధర్మాసనం పేర్కొంది. కేసు విచారణను ఏప్రిల్ 28కి వాయిదా వేసింది. కశ్యప్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదిస్తూ, కశ్యప్‌పై ఎన్ఎస్ఏ ప్రయోగించబడిందని తెలిపారు. అరెస్టయిన యూట్యూబర్‌పై తమిళనాడులో ఆరు, బీహార్‌లో మూడు ఎఫ్ఐఆర్‌లు కూడా ఉన్నాయి. సీజేఐ చంద్రచూడ్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, 'అతనిపై ఎన్ఎస్ఏ? ఈ వ్యక్తిపై ఈ ప్రతీకారం ఎందుకు?' తమిళనాడు తరపున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ, బీహార్ వలస వచ్చిన కూలీలపై తమిళనాడులో దాడులు జరుగుతున్నాయని కశ్యప్ నకిలీ వీడియోలు రూపొందించారని అన్నారు. 'ఆయనకు 60 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆయన రాజకీయ నాయకుడు. ఎన్నికల్లో పోటీ చేశారు. జర్నలిస్టు కాదు' అని సిబల్ బీహార్‌కు కేసుల బదిలీని వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రం తమిళనాడులో ఎఫ్ఐఆర్‌లు తాను ఇచ్చిన ఇంటర్వ్యూలపైనే నమోదయ్యాయని చెప్పారు. కాగా, తనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌లను కలపాలని కోరుతూ కశ్యప్ చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఏప్రిల్ 11న కేంద్రం, తమిళనాడు, బీహార్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కశ్యప్‌పై ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరిన కశ్యప్ తరపు న్యాయవాది తన క్లయింట్‌పై ఇప్పుడు ఎన్ఎస్ఏ కింద కేసు నమోదు చేశారని అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. మదురై పోలీసు సూపరింటెండెంట్ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, కశ్యప్‌ను ఎన్ఎస్ఏ కింద అదుపులోకి తీసుకున్నారు. ఏప్రిల్ 5న మదురై జిల్లా కోర్టు ముందు హాజరైన కశ్యప్‌ను 15 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలని ఆదేశించడంతో మదురై సెంట్రల్ జైలుకు తరలించారు. తమిళనాడులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లన్నింటినీ బీహార్‌లో నమోదు చేసిన వాటితో కలపాలని పిటిషనర్ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. బీహార్ నుంచి వలస వచ్చిన కార్మికులపై తమిళనాడులో జరిగిన హింసాత్మక సంఘటనలు మీడియాలో విస్తృతంగా వెలువడ్డాయి. పిటిషనర్ మార్చి 1 నుంచి సామాజిక మాధ్యమ వేదికలలో వీడియోలు చేయడం, ట్విట్టర్‌లో దానికి సంబంధించిన విషయాలు రాయడం ద్వారా దానికి వ్యతిరేకంగా తన గొంతును లేవనెత్తారని పిటిషన్ పేర్కొంది.

డీకే నామినేషన్‌కు ఈసీ ఓకే

కనకపురలో మంత్రి అశోకతో పోటీ

బెంగళూరు: కర్నాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ నామినేషన్‌కు ఎన్నికల కమిషనర్ శుక్రవారం ఆమోదం తెలిపారు. దీంతో కనకపుర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన పోటీకి మార్గం సుగమమైంది. డీకేపై బీజేపీ అభ్యర్థిగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆర్.అశోక పోటీ చేస్తున్నారు. కనకపుర నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన డీకే శివకుమార్ సోమవారం తన మద్దతుదారులతో కలిసి వెళ్లి నామినేషన్ వేశారు. తన నామినేషన్ రద్దు చేసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తగా ఆయన తన సోదరుడు, బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్‌తోనూ కనకపుర నియోజకవర్గం నుంచి నామినేషన్ వేయించారు. పార్టీ బ్యాకప్ అభ్యర్థిగా డీకే సురేశ్ నామినేషన్ వేశారు. మనీ లాండరింగ్, పన్ను ఎగవేతలకు సంబంధించిన ఆరోపణలపై ఈడీ, ఆదాయ పన్ను శాఖ కేసులను డీకే శివకుమార్ ఎదుర్కొంటున్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష సాధించాలని అనుకుంటోందని డీకే చెబుతున్నారు. కాగా, బీజేపీ వ్యూహాత్మకంగా కనకపుర నుంచి పార్టీ అభ్యర్థిగా ఆర్.అశోకను నిలబెట్టింది. వొక్కలిగ సామాజిక వర్గానికి చెందిన అశోక్‌కు మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప సన్నిహితుడిగా పేరుంది. రామనగర జిల్లాలోని కనకపుర నియోజకవర్గంలో వొక్కలిగ సామాజికవర్గానికి గట్టి పట్టుంది. 60 శాతం మంది ఓటర్లు ఈ సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నారు. మే 10న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా, మే 13న ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటించనున్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం

3న రాష్ట్రవ్యాప్త రాస్తారోకోలు

మోదీని గద్దె దించుదాం... దేశాన్ని కాపాడుకుందాం

తాడేపల్లిగూడెం బహిరంగ సభలో రామకృష్ణ

విశాలాంధ్ర న్యూస్ నెట్‌వర్క్: రాష్ట్ర ప్రజలు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం వామపక్షాలు, ఇతర ప్రతిపక్ష పార్టీలు మే 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. స్థానిక ఎన్‌కే గ్రౌండ్లో సీపీఐ, సీపీఎం ప్రచార భేరి యాత్ర, పశ్చిమ గోదావరి జిల్లా బహిరంగ సభ శుక్రవారం జరిగింది. సీపీఐ, సీపీఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శులు కోనాల భీమారావు, బి.బలరాం అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ వేలాదిమంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోదీ ప్రభుత్వం స్వార్ధంతో ప్రైవేటీకరణకు పూనుకుందన్నారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, కార్మికులు, ప్రతిపక్ష పార్టీలు రాస్తారోకో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. 9ఏళ్ల మోదీ పరిపాలనలో కార్మిక హక్కులను కాలరాస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ప్రధాని మోదీ...అదానీ, అంబానీలకు రెడ్ కార్పెట్ పరుస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారన్నారు. బ్యాంకుల్లో రుణాలు పొంది వాటి ఎగవేతకు పాల్పడిన అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు రైల్వేలు, ఎల్ఐసీ, విద్యుత్, విమానాశ్రయాలు, విశాఖ ఉక్కు లాంటి భారీ ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతున్నారని మండిపడ్డారు. 2014లో రూ.47 లక్షల కోట్లు అప్పుల్లో ఉన్న భారత దేశం 2023లో రూ.150 లక్షల కోట్లకు చేరిందన్నారు. మోదీని గద్దె దించేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలోని 21 లౌకిక పార్టీలు ఐక్యంగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

రాష్ట్రంలో జగన్ తుగ్లక్ పరిపాలన సాగిస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. భారీ మెజారిటీతో గెలిచినా కేసుల భయంతో జగన్ సంతోషంగా లేరన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పోలవరానికి నిధుల కోసం కేంద్రాన్ని నిలదీయలేని పరిస్థితి జగన్‌దని ఆరోపించారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారన్నారు. వివేకా హత్య కేసులో ప్రధాన నిందితులు ఎవరో బయటపెట్టాలని జగన్‌ను డిమాండ్ చేశారు. అభివృద్ధిపై నిలదీస్తే కేసులు, నిర్బంధాలకు గురిచేయడం సరికాదన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఎక్కడా అభివృద్ధి ఆనవాళ్లు లేవన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్. బాబూరావు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చేస్తుంటే వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. రాజకీయ స్వలాభం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజలను వాడుకుంటున్నాయన్నారు. సీపీఐ, సీపీఎం కార్మికుల హక్కుల కోసం, పరిశ్రమల నిర్మాణం కోసం పోరాటాలు చేస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయన్నారు. కార్మికులంతా ఐక్యంగా హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు సభకు స్వాగతం పలికారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు వందన సమర్పణ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, నెక్కంటి సుబ్బారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న మోదీని గద్దెదింపుదాం: జల్లి విల్సన్

ప్రజా వ్యతిరేక, నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపి కార్పోరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన ప్రచార భేరీలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారం లోకి వచ్చిన నాటినుండి దేశ ప్రజలపైన విపరీతంగా భారాలు మోపారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ రంగాలకు దారాదత్తం చేస్తున్నారన్నారు. ఆంధ్రులు త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టి రాష్ట్ర భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని మండి పడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తే ఆంధ్రుల పౌరుషాన్ని చవి చూడవలసి వస్తుందని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ... రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలసి ఆంధ్ర ప్రజలకు తీరని ద్రోహం చేశాయన్నారు. ప్రత్యేక హెూదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణానికి సంబంధించి న నిధులు రైల్వే జోన్, విభజన చట్టంలోని హామీల అమలు ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర హక్కులను సాధించి ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ కలసి పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ దర్శి సభ్యులు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి గంగయ్య, డివిజన్ కార్యదర్శి మణిలాల్, సీపీఐ నాయకులు నాగంజానేయులు, జీ బాలాజీ, వేమూరు కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగం నడ్డి విరుస్తున్న బీజేపీ:జంగాల

గుంటూరు జిల్లా నవులూరు, చిన్నకాకాని గ్రామాలలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ ప్రచార భేరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ... పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా మోదీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిత్యవసర వస్తువులు, మందుల ధరలను రోజురోజుకు పెంచుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ప్రైవేటీకరణ వైపు శరవేగంగా పరుగులు పెడుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రత్యేక హోదా, విభజన హామీ చట్టాలను తుంగలో తొక్కిన కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ, టీడీపీ, జనసేన నోరుమెదపడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీకి అధికార, ప్రతిపక్ష పార్టీలు వంతపాడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు ఎం.రవి, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల జీవితాలు బాగు చేయడమే లక్ష్యం

అన్నదాతల ఆత్మీయ సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర-మార్కాపురం: రైతుల జీవితాలను బాగు చేయడమే తన ధ్యేయమని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మార్కాపురంలో అన్నదాతల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతులు, కౌలు రైతుల జీవితాలు మార్చేందుకు టీడీపీ హయాంలో చాలా చేశామన్నారు. యాంత్రీకరణ, సబ్సిడీలు, గిట్టుబాటు ధరల ద్వారా రైతులకు మేలు చేశామని, మారిన ఆహారపు అలవాట్ల కారణంగా చిరుధాన్యాలు, ఆక్వా ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. పాడి పరిశ్రమకు కూడా డిమాండ్ పెరిగిందని చెప్పారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు భారీ ప్రణాళికలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకి సీఎం జగన్ ఉచ్చు బిగించారని చంద్రబాబు విమర్శించారు. అమరావతికి రైతులు 33 వేల ఎకరాల భూములు ఇచ్చారన్నారు. జగన్ రాజధానికి కులం, మతం, ప్రాంతం రంగుపూసి నాశనం చేశారని మండిపడ్డారు. రైతులకు ఇన్సూరెన్స్ విషయంలో వైసీపీ ప్రభుత్వం అబద్ధాలు చెప్పిందన్నారు. ఆనాడు తాను మొదటి సారి అసెంబ్లీలో పోడియం వద్ద నిరసన వ్యక్తం చేశానని, సమస్యను ప్రస్తావించిన తరువాత ప్రభుత్వం ఇన్సూరెన్స్ చెల్లించిందన్నారు. రైతుల నుంచి వచ్చిన సూచనలను తమ మేనిఫెస్టోలో పెడతామన్నారు. 2014లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రతి రైతుకు 1.5 లక్షల రుణమాఫీ చేశామన్నారు. తాను రైతు బిడ్డనని, తనకు రైతు కష్టాలు తెలుసునని... వాటిని పరిష్కరిస్తానని చంద్రబాబు అన్నదాతలకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో జగన్ ఆదాయం పెరగ్గా, రైతుల ఆదాయం తగ్గిందని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ప్రతిరైతుపై రూ.2.45లక్షల అప్పుభారం పడిందని చెప్పారు. ఈ ముఖ్యమంత్రి ఏనాడైనా ఒక్కరైతు ముఖమైనా చూశాడా? గడపదాటి బయటకు రాని ముఖ్యమంత్రి ఉండటం మన దౌర్భాగ్యమని చంద్రబాబు అన్నారు. జగన్ ఈ ఐదేళ్ల లో రూ.7వేలచొప్పున మీకు ఇచ్చేది కేవలం రూ.35వేలు మాత్రమేనన్నారు. టీడీపీ ప్రభుత్వంలో తొలిసారి మొత్తం రూ.50వేల రుణమాఫీచేసి, తరువాత మరలా 'అన్నదాతాసుఖీభవ' కింద 4, 5వ విడతల కింద ఒక్కోరైతుకి రూ.లక్షా50వేలు ఇస్తే...జగన్ వచ్చి మీకు అంద కుండా అడ్డుకున్నాడని రైతులను ఉద్దేశించి చంద్రబాబు అన్నారు. రైతులకు భూసారపరీక్షలు అందుబాటులోకి తెచ్చామని, సబ్సిడీపై ఎరువులు, పురుగమందులు, యంత్రపరికరాలు, డ్రిప్ పరికరాలు, ట్రాక్టర్లు ఇచ్చామని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యి, నదుల అనుసంధానం జరిగి వెలిగొండ పూర్తయినట్లయితే రైతుల జీవితాలే మారిపోయేవని తెలిపారు. కానీ ఈ సైకో ఏంచేశాడు? అని ప్రశ్నించారు. రైతులు ఎవరైనా జగన్ ను ప్రశ్నించే స్థితిలో ఉన్నారా? రూ.12,500లు ఇస్తానన్న పెద్దమ నిషి రూ.7వేలు ఇస్తుంటే ఎందుకు ప్రశ్నించరన్నారు. రైతుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, మీ జీవితాల్ని బాగుచేసేవరకు ప్రతి రైతుకి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించిన చంద్రబాబు... వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

ఆసక్తికరంగా ఐపీఎల్

అగ్రస్థానంపై కన్నేసిన దిగ్గజ జట్లు

న్యూఢిల్లీ: ఐపీఎల్ సీజన్16... రోజురోజుకు ఉత్కంఠగా మారుతోంది. ఇప్పటికే చాలా జట్లు ఆరు మ్యాచ్‌లు ఆడాయి. 28వ మ్యాచ్ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. పంజాబ్ కింగ్స్‌పై విజయంతో ఆర్‌సీబీ జట్టు పాయింట్ల పట్టికలో 2 స్థానాలు ఎగబాకింది. మరోవైపు వరుస పరాజయాలతో షాక్‌కు గురైన వార్నర్ జట్టు కూడా ఎట్టకేలకు విజయాల ఖాతా తెరిచింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఏ జట్టు స్థానం ఎక్కడుందో తెలుసుకుందాం...

- రాజస్థాన్ రాయల్స్ (8 పాయింట్లు): 6 మ్యాచ్‌లు ఆడి 4విజయాలు, 2 ఓటములతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. రాజస్థాన్ జట్టు ప్రస్తుత నెట్ రన్ రేట్ +1.043.
- లక్నో సూపర్ జెయింట్స్ (8 పాయింట్లు): 6 మ్యాచ్‌ల్లో 2 ఓటములు, 4 విజయాలు నమోదు చేసి +0.709 నెట్ రన్ రేట్‌తో రెండో స్థానంలో నిలిచింది.
- చెన్నై సూపర్ కింగ్స్ (6 పాయింట్లు): మహేంద్ర సింగ్ ధోనీ నేతృత్వంలోని చెన్నై జట్టు 5 మ్యాచ్‌ల్లో 2 ఓటములు, 3 విజయాలతో 3వ స్థానంలో ఉంది. నెట్ రన్ రేట్ +0.265.
- గుజరాత్ టైటాన్స్ (6 పాయింట్లు): డిఫెండింగ్ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఆడిన 5 మ్యాచ్‌ల్లో 2 ఓటములు, 3 విజయాలు నమోదు చేసింది. దీంతో +0.192 నెట్ రన్ రేట్‌తో 4వ స్థానంలో ఉంది.
- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (6 పాయింట్లు): ఫాఫ్ డుప్లెసిస్ నేతృత్వంలోని ఆర్‌సీబీ జట్టు 6 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 3 మ్యాచ్‌లు గెలిచి 3 మ్యాచ్‌లు ఓడిపోయింది. నెట్ రన్ రేట్ -0.068 సాధించి 5వ స్థానంలో నిలిచింది.
- ముంబై ఇండియన్స్ (6 పాయింట్లు): ఆడిన 5 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 2 ఓటములు నమోదుచేసింది. నెట్ రన్ రేట్ -0.164తో 6వ స్థానంలో నిలిచింది.
- పంజాబ్ కింగ్స్ (6 పాయింట్లు): శిఖర్ ధావన్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ జట్టు ఆడిన 6 మ్యాచ్‌లలో 3 గెలిచి 3 ఓడిపోయి -0.298 నెట్ రన్ రేట్‌తో 7వ స్థానంలో నిలిచింది.
- కోల్‌కతా నైట్ రైడర్స్ (4 పాయింట్లు): కేకేఆర్ ఆడిన 6 మ్యాచ్‌లలో 4 ఓడిపోయి 2 గెలిచింది. ప్రస్తుతం +0.214 నెట్ రన్ రేట్‌తో 8వ స్థానంలో ఉంది.
- సన్‌రైజర్స్ హైదరాబాద్ (4 పాయింట్లు): సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆడిన 5 మ్యాచ్‌లలో 2 గెలిచి, 3 మ్యాచ్‌లు ఓడిపోయింది. -0.798 నెట్ రన్ రేట్‌తో 9వ స్థానంలో ఉంది.
- దిల్లీ క్యాపిటల్స్ (2 పాయింట్లు): డేవిడ్ వార్నర్ నేతృత్వంలోని ఈ జట్టు ఆడిన 6 మ్యాచ్‌లలో ఒక్కటి మాత్రమే గెలిచింది. నెట్ రన్ రేట్ -1.183తో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది.

పూరీ తదుపరి సినిమా రామ్‌తో?

హైదరాబాద్: లైగర్ సినిమా డిజాస్టర్ తర్వాత పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించే తదుపరి సినిమా ఏంటనే దానిపై డైలామా ఏర్పడింది. ఇదిలా ఉంటే పూరీ జగన్నాథ్ మరోసారి రామ్‌తో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. పూరీ జగన్నాథ్, ఛార్మీ బ్యానర్ పూరీ కనెక్ట్స్ పై రామ్ హీరోగా మరో సినిమా రాబోతుందని తాజా సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడకపోయినా ఈ వార్తను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు రామ్ అభిమానులు. రామ్-పూరీ కాంబోలో రాబోతున్న ఈ చిత్రం ఏ జోనర్‌లో ఉండబోతుంది.. మళ్లీ బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్‌లో రికార్డులు సృష్టించబోతుందోనని అప్పుడే అంచనాలు వేసుకుంటున్నారు మూవీ లవర్స్. ఎందుకంటే ఇస్మార్ట్ శంకర్ సినిమాతో రామ్‌కు బ్లాక్ బస్టర్ హిట్టందించాడు పూరీ జగన్నాథ్. రామ్ ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో 20వ సినిమా చేస్తున్నాడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఈ ఏడాది దసరా కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. బోయపాటి-రామ్ సినిమా పూర్తయిన తర్వాత పూరీ-రామ్ క్రేజీ కాంబో ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మరి దీనిపై రామ్ ఏదైనా స్పందిస్తాడేమోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు.

దశరథ్ దర్శకత్వంలో సుడిగాలి సుధీర్ సినిమా

హైదరాబాద్: మెజిషియన్ నుంచి జబర్దస్థ్‌లో కంటెస్టెంట్‌గా ప్రయాణం మొదలు పెట్టిన సుధీర్ అనతికాలంలోనే తన కామెడీ టైమింగ్‌తో లీడర్‌గా మారి సుడిగాలి సుధీర్‌గా బుల్లితెర ప్రేక్షకుల్లో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్నాడు. ఇక సినిమాల్లో అడపా దడపా క్యారెక్టర్‌లు చేస్తూ వస్తున్న సుధీర్ హీరోగా మారి హిట్ సినిమాలు చేస్తున్నాడు. త్రీ మంకీస్, వాంటెడ్ పండుగాడు వంటి సినిమాల్లో హీరోగా చేసిన అవి అంతగా గుర్తింపు తెచ్చిపెట్టలేక పోయాయి. అయితే గతేడాది ఆయన నటించిన గాలోడు రిలీజై బాక్సాఫీస్ దగ్గర కమర్షియల్ సక్సెస్ సాధించింది. నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. దాంతో హీరోగా సుధీర్‌కు ప్రేక్షకుల ఆమోదం దొరికింది. నిర్మాతలు కూడా డబ్బులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. కాగా తాజాగా సుధీర్‌కు బంపర్ ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. సంతోషం, మిస్టర్ పర్‌ఫెక్ట్ వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలు తెరకెక్కించిన దశరథ్‌తో సుధీర్ చేతులు కలపనున్నట్లు సమాచారం. ఇప్పటికే కథా చర్చలు కూడా ముగిసాయని తెలిసింది. ఇక దశరథ్ కొంత కాలంగా లైమ్ లైట్‌లో లేడు. ఏడేళ్ల క్రితం వచ్చిన శౌర్య మూవీ దశరథ్‌కు చివరి సినిమా. ఇక త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లే చాన్స్ ఉంది.

సామ్‌కరన్‌పై సెహ్వాగ్ విమర్శలు

న్యూఢిల్లీ: పంజాబ్ కింగ్స్ స్టాండింగ్ కెప్టెన్ సామ్ కరన్ పై భారత జట్టు మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శలు గుప్పించాడు. రూ.18.50 కోట్లు పెట్టి మ్యాచ్ విన్నర్‌ను కొనలేమని అన్నాడు. 'సామ్ కరన్ అంతర్జాతీయ ఆటగాడు. కోట్లు పెట్టి కొనుగోలు చేసినంత మాత్రాన అతను మ్యాచ్‌లు గెలిపిస్తాడని అనుకోవడం పొరపాటు. ఎందుకంటే.. అతడికి అనుభవం లేదు. క్రికెట్‌లో అనుభవం అనేది మ్యాచ్‌లు ఆడుతుంటేనే వస్తుంది' అని ఈ మాజీ డాషింగ్ ఓపెనర్ తెలిపాడు. కెప్టెన్ శిఖర్ ధావన్ గాయపడడంతో సామ్ కరన్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లో ఆకట్టుకున్న సామ్ కరన్ రెండో మ్యాచ్‌లో సత్తా చాటలేకపోయాడు. గత మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చేతిలో పంజాబ్ అనూహ్యంగా ఓడిపోయింది. 175 లక్ష్య ఛేదనలో 150 పరుగులకే పరిమితమైంది. ఈ మ్యాచ్‌లో సామ్ కరన్ బ్యాటింగ్, బౌలింగ్‌లో విఫలమయ్యాడు. 12 బంతులు ఎదుర్కొన్న అతను 10 పరుగులకే రనౌటయ్యాడు. దాంతో, పంజాబ్ మూడో ఓటమితో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచింది. ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరాలంటే కెప్టెన్ శిఖర్ ధావన్ ఆడడం ఎంతో ముఖ్యం. ఫామ్‌లో ఉన్న అతను చెలరేగితే పంజాబ్ గెలుపు బాట పట్టడం ఖాయం. ఆ జట్టు ఏప్రిల్ 22న తదుపరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.

వన్డేల్లో అత్యంత వేగంగా 100 వికెట్లు

రషీద్‌ఖాన్ రికార్డు బద్దలు కొట్టిన నేపాల్ బౌలర్ లిమిచానే

ఖాట్మండు: నేపాల్ యువ బౌలర్ వన్డేల్లో సరికొత్త రికార్డు సృష్టించాడు. లెగ్ స్పిన్నర్ సందీప్ లమిచానే వన్డేల్లో వేగంగా 100 వికెట్లు పడగొట్టాడు. 22 ఏళ్ల సందీప్ 42 మ్యాచుల్లోనే ఈ ఫీట్ సాధించడం విశేషం. దాంతో, అఫ్గానిస్థాన్ టీ20 కెప్టెన్ రషీద్ ఖాన్ పేరిట ఉన్న ఐదేళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. ఏసీసీ మెన్స్ ప్రీమియర్ కప్‌లో ఒమన్ జట్టుపై సందీప్ ఈ ఘనతకు చేరువయ్యాడు. రషీద్ 44 వన్డేల్లో 100 వికెట్లు తీశాడు. అతను 2018లో ఈ ఘనత సాధించగా అప్పటి నుంచి ఆ రికార్డు రషీద్ పేరు మీదే ఉంది. వన్డేల్లో వేగంగా 100 వికెట్లు తీసి సందీస్ దిగ్గజాలను దాటేశాడు. లెజెండరీ బౌలర్లకు ఈ ఫీట్ సాధించడానికి ఎన్ని మ్యాచ్‌లు పట్టిందో చూద్దాం. ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ 52 మ్యాచుల్లో ఈ ఫీట్ సాధించాడు. పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ సక్లెయిన్ ముస్తాక్ 53 వన్డేల్లో వంద వికెట్లు తీశాడు. న్యూజిలాండ్ దిగ్గజం షేన్‌బాండ్, బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ 54 మ్యాచుల్లో వంద వికెట్ల క్లబ్‌లో చేరారు. క్రికెట్ ఆటతో ఎంతో గుర్తింపు తెచ్చుకున్న సందీప్‌పై గత ఏడాది చెరగని మచ్చ పడింది. దాంతో అతని కెరీర్ ప్రమాదంలో పడింది. అందుకు కారణం.. అతడు లైంగిక దాడి ఆరోపణల కేసులో జైలుకు వెళ్లాడు. దాంతో, అతడిపై నేపాల్ క్రికెట్ నిషేధం విధించింది. అయితే.. ఈ ఏడాది ఫిబ్రవరిలో సందీప్‌పై నిషేధాన్ని ఎత్తి వేసింది. కానీ, కేసు మాత్రం నడుస్తూనే ఉంది. సందీప్ లమిచానే ఐపీఎల్‌లోనూ అదరగొట్టాడు. 2018 నుంచి 2020 వరకు దిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అయితే... ఆడింది మాత్రం 9 మ్యాచులే. 2018లో ఆరు వికెట్లు, 2019లో 13 వికెట్లు పడగొట్టాడు. 2020లో దిల్లీ జట్టు కూర్పు సరిపోవడంతో ఈ లెగ్ స్పిన్నర్‌కు అవకాశం రాలేదు. అప్పటి నుంచి అతను ఒక్క ఐపీఎల్ మ్యాచ్ కూడా ఆడలేదు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.